




తాడేపల్లి: కుంచనపల్లిలోని అపర్ణా వన్ గేటెడ్ కమ్యూనిటీలో ఏర్పాటు చేసిన పర్యావరణహిత గణపతి

గణపతియే నమః

వాడవాడలా ఘనంగా చవితి ఉత్సవాలు

స్వామి విగ్రహాల దర్శనాలకు పోటెత్తుతోన్న భక్తులు









గుంటూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగను జిల్లా అంతటా భక్తులు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. వాడవాడలా గణపతి సంబరాల కోలాహలం నెలకొంది. ఈ ఏడు వందల సంఖ్యలో మండపాలను ఏర్పాటు చేసిన ఉత్సవ కమిటీలు అట్టహాసంగా పూజలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఉదయం నుంచే ఆధ్యాత్మిక శోభతో ఆలయాలు, మండపాలు కళకళలాడాయి. వివిధ కూడళ్లలో ఏర్పాటు చేసిన మండపాలను సుందరంగా అలంకరించి వినూత్న రీతుల్లో స్వామి విగ్రహాలను ఏర్పాటు చేశారు. మండపాల్లో భారీ విగ్రహాలకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. వివిధ రూపాల్లో తీర్చిదిద్దిన ఉత్సవ మండపాలు, విగ్రహాలు భక్తులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి విఘ్నేశ్వరుని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తున్నారు. గుంటూరులో వివిధ ప్రాంతాల్లో మట్టి గణపతులను ప్రతిష్ఠించి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. విఘ్నేశ్వరస్వామి ఆలయాలు కూడా భక్తులతో కిటకిటలాడాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఇళ్లలోనూ చిన్నాపెద్ద తారతమ్యం లేకుండా ఘనంగా చవితి వేడుకలను జరుపుకున్నారు.

గుంటూరు : చల్లావారిపాలెంలో అవతార్ సెట్టింగ్‌తో మట్టి గణపతి విగ్రహం | పొన్నూరు : శలపాడు చౌదరి యూత్ ఆధ్వర్యంలో కొలువుదీరిన గణనాథుడు | తెనాలి : రామలింగేశ్వరపేటలో ఎడ్లబండిపై వినాయకుడు | గుంటూరు : ఇన్నర్‌రింగు రోడ్డులో కొలువైన 99 అడుగుల భారీ మట్టి గణనాథుడు

యూరియా కోసం బారులు

అరకొర పంపిణీతో ఎగబడుతున్న రైతులు

- సరిపడ నిల్వలు ఉన్నాయని అధికారుల ప్రకటన
- క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధంగా అన్నదాతల ఇబ్బందులు
- అవసరానికి మించి కొనుగోళ్లతోనే ఇక్కట్లు అంటున్న అధికారులు
- బ్లాక్ చేసి సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు.. పట్టించుకోని అధికారులు

వర్షాలతో సాగుపనుల్లో నిమగ్నం కావాల్సిన రైతులు ఎరువుల కోసం ఎగబడాల్సి వస్తోంది. ప్రస్తుత అవసరాలకు సరిపోయినంతగా యూరియా అందుబాటులో ఉందని అధికారులు ప్రకటిస్తున్నా.. తమకు దొరుకుతుందో లేదో.. అవసరమైనప్పుడు ఇబ్బంది పడుతామేమోనన్న ఆందోళనలో రైతులు విక్రయ కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. సిఫార్సులతో కొందరు అదనంగా కొనుగోలు చేస్తుండటంతో సన్నచిన్నకారు రైతులకు యూరియా అందక అల్లాడుతున్నారు. సహకార సొసైటీలు, రైతు సేవా కేంద్రాల వద్ద యూరియా కోసం రైతులు బారులు తీరి కనబడుతున్నారు. ఇదే అదనుగా కొందరు యూరియాను బ్లాక్ చేసేస్తున్నారు. 60 శాతం సరఫరా చేసినట్లు అధికారిక గణాంకాలు ఉన్నాయి. అయితే అధికశాతం రైతులు తమకు ఎరువులు అందలేదని ఆరోపిస్తున్నారు.

(గుంటూరు సిటీ, బాపట్ల, రేపల్లె, కొల్లూరు, దాచేపల్లి-ఆంధ్రజ్యోతి)

సాగు విస్తీర్ణంతో బేరీజు వేస్తే ప్రస్తుతం కేటాయించిన యూరియా నిల్వలు మిగులుగా ఉండాలి. కానీ ఆ పరిస్థితి లేకపోగా రైతులు ఇక్కట్లు పడాల్సిన వింత పరిస్థితి గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో కనిపిస్తోంది. ఉదాహరణకు బాపట్ల జిల్లాలో సెప్టెంబరు చివరికి యూరియా అవసరాలు 22,000 మెట్రిక్ టన్నులుగా వ్యవసాయశాఖ అంచనా వేసి 13,000 టన్నులు కేటాయించినట్లు చెబుతున్నారు. 27వ తేదీకి గుంటూరు జిల్లాకు 363 మెట్రిక్ టన్నులు, బాపట్లకు 417 మెట్రిక్ టన్నులు యూరియా వచ్చింది. ప్రస్తుతం గుంటూరు, బాపట్ల జిల్లాల్లోనే యూరియా అవసరం ఎక్కువగా ఉంది. అయితే ఇప్పటికీ యూరియా కోసం రైతులు మూడు జిల్లాల్లోనూ ఎగబడుతూనే ఉన్నారు. ఇదే పరిస్థితి అటు గుంటూరు, ఇటు పల్నాడు జిల్లాల్లోనూ నెలకొని ఉంది. సీజన్‌లో అవసరాలకు సరిపడా (మిగతా 8లో)



కొల్లూరు మండలం గాజుల్లంక పీఏసీఎస్ వద్ద యూరియా కోసం రైతుల పడిగాపులు



పొందుగల చెక్ పోస్టు వద్ద విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న యూరియా బస్తాలు

హద్దులు దాటిన యూరియా దందా

పుష్కలంగా ఉన్న ఎరువులను వ్యాపారులు పక్కదారి పట్టిస్తున్నారు. వ్యాపారులు, దళారులు మాఫియాగా మారి యూరియాను ఇష్టానుసారంగా అమ్ముకుంటున్నారు. పల్నాడు జిల్లాలోని దాచేపల్లి, మాచర్ల, రెంటచింతల మాచవరం, పిడుగురాళ్ల మండలాల నుంచి (మిగతా 8లో)

అర్హత లేని వారికి టెండర్లు

హోర్డింగ్‌లపై చర్యల్లో తాత్సారమేల

కౌన్సిల్‌లో అధికారులను నిలదీసిన ప్రజాప్రతినిధులు

గుంటూరు, కార్పొరేషన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): 'అర్హత లేని వారికి టెండర్లు అప్పగిస్తున్నారు.. టెండర్లలో 30, 40 శాతం తక్కువకే వేస్తున్నారు.. వారు పనులు ఎలా చేస్తున్నారు.' అంటూ నగర పాలక సంస్థ అధికారులను పలువురు ప్రజాప్రతినిధులు నిలదీశారు. గురువారం నగర పాలక సంస్థ



మేయర్ కోవెలమూడి రవీంద్ర అధ్యక్షతన కొనసాగుతున్న కౌన్సిల్ సమావేశం

కౌన్సిల్ సమావేశం మేయర్ కోవెలమూడి రవీంద్ర అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ప్రజా సమస్యలపై వాడివేడిగా చర్చ జరిగింది. గతంలో జరిగిన సమావేశాల్లో ప్రజా సమస్యలు చెప్పినా అధికారులు పట్టించుకోవడం లేదంటూ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు మండిపడ్డారు. టెండర్ల అంశంపై చర్చలో ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ కార్పొరేషన్‌లో ఇంజనీరింగ్ వ్యవస్థ భ్రష్టు పడుతుందని ఆరోపించారు. కార్పొరేషన్‌లో అక్రమ కాంట్రాక్టర్ల మాఫియా సాగుతుందని ఆరోపించారు. అర్హత లేని కాంట్రాక్టర్లు పనులు దక్కించుకుంటున్నారని బోగస్ కాంట్రాక్టర్లతో (మిగతా 6లో)



6

డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

- తొలి రోజు 932 మందికి పూర్తి
- 28 కమిటీలతో ప్రత్యేక ఏర్పాట్లు

- ఉధృతంగా కృష్ణమ్మ భయాందోళనలో ప్రజలు
- పొంగి ప్రవహిస్తున్న వాగులు
- సాగర్ 26 క్రస్ట్‌గేట్ల నుంచి నీటి విడుదల
- ప్రకాశం బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక



ప్రకాశం బ్యారేజి దిగువకు ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణానది వరదనీరు

వీడని వర్షాలు

తాడేపల్లి టౌన్, రేపల్లె, కొల్లిపర, విజయపురిసౌత్, రెంటచింతల, అచ్చంపేట, అమరావతి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటికే తీవ్రంగా నష్టపోయిన రైతులు వీడని వర్షాలతో అల్లాడుతున్నారు. మరోవైపు ఎగువ నుంచి భారీగా వస్తున్న వరద ప్రవాహంతో నాగార్జున సాగర్ నుంచి నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో కృష్ణానదిలో నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. కొన్ని ప్రాంతాల్లో కట్టలను తాకుతూ ప్రవహిస్తున్న నీటితో నదీ తీర ప్రాంతప్రజలు భయాందోళన చెందుతున్నారు. ప్రకాశం బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. దీంతో బ్యారేజీ దిగువన గ్రామాలు, లంకల్లోని ప్రజలు బిక్కుబిక్కుమంటూ ఉన్నారు. నదీ తీరంలో ఎక్కడికక్కడ అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తూ భద్రతా చర్యలు తీసుకున్నారు. బుధవారం ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాల్లో వాగులు పొంగి ప్రవహించడంతో ఎక్కడికక్కడ రాకపోకలు స్తంభించిపోయాయి. వాగుల వెంబడి సాగుభూములు వరద నీటితో చెరువులను తలపిస్తున్నాయి.



రేపల్లె మండలం రావిఅనంతవరం సమీపంలో కృష్ణానదిలో ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీరు

నాగార్జున సాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి వరద ప్రవాహం కొనసాగుతుంది. శ్రీశైలం నుంచి 2,46,410 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. దీంతో గురువారం ప్రాజెక్ట్ అధికారులు 26 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. నీటిమట్టం 586.60 అడుగులు ఉండగా 2,46,410 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సత్రశాలలోని సాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు చెందిన 20 రేడియల్ క్రస్ట్ గేట్లకు 14 గేట్లను ఎత్తి 1,84,833 క్యూసెక్కుల నీటిని దిగువన వున్న పులిచింతలకు విడుదల చేశారు. సాగర్ నుంచి వస్తున్న నీటిని వచ్చినట్లు విడుదల చేస్తున్నారు. వరద నీటి ఉధృతితో ప్రాజెక్టులో విద్యుదుత్పత్తిని కూడా నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. భారీ వర్షాలు, ఎగువ నుంచి వస్తున్న వరదతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది పరవళ్ళు తొక్కుతోంది. ఎగువ నుంచి గురువారం 4,43,184 క్యూసెక్కుల వరదనీరు రిజర్వాయర్‌కు చేరుతోంది. వరద 4 లక్షల క్యూసెక్కులు దాటడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12.8 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా మొత్తం 70 గేట్లను ఎత్తి దిగువకు 4 లక్షల 32 వేల 837 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ శాఖ జేఈ రాజేష్ తెలిపారు. వరద ఉధృతి పెరుగుతుండడంతో నదీతీర, లంకల్లోని రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

కరకట్ట వెంబడి పెట్రోలింగ్

భట్టిప్రోలు మండలం కరకట్ట నుంచి పెసర్లంక వెళ్లే చినరేవు ఓలేరు నుంచి లంకగ్రామాలకు వెళ్లే చిన్నరేవులో వరద నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. పెనుమూడి పుష్కర్‌ఘాట్‌ను వరద నీరు తాకింది. అధికారులు కరకట్టవెంబడి పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. రేపల్లె తహసీల్దారు మోర్ల శ్రీనివాసరావు వరద ఉధృతిని పరిశీలించి పరిస్థితిని అంచనా వేసి ప్రజలను అప్రమత్తం చేసి గ్రామాల్లో రెవెన్యూ సిబ్బందిని ఏర్పాటు చేశారు. కొల్లిపర తహసీల్దారు సిద్ధార్థ, ఎస్ఐ కోటేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీవో భార్గవ్ గురువారం బొమ్మువానిపాలెం, కొల్లిపర, అన్నవరం గ్రామాల్లోని రేవులను సందర్శించి వరద ఉధృతిని పరిశీలించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు.

8

దరఖాస్తు చేయకుంటే మీ సంగతి చూస్తాం

- అసోసియేషన్ నేతలతో ఎక్సైజ్ అధికారుల హెచ్చరికలు
- బార్లకు నేటితో ముగియనున్న గడువు.. వ్యాపారులతో చర్చలు

గంజాయి విక్రయదారుల అరెస్టు

పదోన్నతుల కోసం ఏఎన్ఎంల నిరసన

బీఫార్మసీ విద్యార్థి ఆత్మహత్య

- కళాశాల ఎదుట మృతదేహంతో ఆందోళనకు యత్నం
- అడ్డుకున్న పోలీసులు

6

అత్యాచారం కేసులో నిందితులకు రిమాండ్



చిలకలూరిపేటలో కోర్టుకు హాజరైన ఎమ్మెల్యే ప్రత్తిపాటి, అప్పారావు తదితర టీడీపీ నేతలు

కోర్టుకు హాజరైన ఎమ్మెల్యే ప్రత్తిపాటి, సీనియర్ టీడీపీ నేతలు

చిలకలూరిపేట, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ఆయన అనుచరులు అప్పారావు తదితరులపై వైసీపీ ప్రభుత్వ కేసులకు సంబంధించి గురువారం చిలకలూరిపేట జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో విచారణకు హాజరయ్యారు. ఈ కేసులను విచారించిన జడ్జి కె నరేంద్ర రెడ్డి సెప్టెంబరు 1 న తీర్పు ఇవ్వనున్నట్టు ప్రకటించారు. జగన్ ప్రభుత్వ హయాంలో 2023 సెప్టెంబర్‌లో చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును వ్యతిరేకిస్తూ చిలకలూరిపేట నియోజకవర్గంలో టీడీపీ శ్రేణులు తీవ్ర స్థాయిలో నిరసన వ్యక్తం చేశారు. ఆ సందర్భంలో ప్రత్తిపాటి పిలుపు మేరకు జాతీయ రహదారిపై తిమ్మాపురం వద్ద ధర్నా చేశారని యడ్లపాడు పోలీసు స్టేషన్ లో కేసు నమోదయింది. ఈ కేసులో ప్రత్తిపాటితో పాటు యడ్లపాడు మండలానికి చెందిన మరో 20 మంది సీనియర్ టీడీపీ నాయకులపై కేసు నమోదయింది. వారిలో కుర్రా అప్పారావు, ముద్దన నాగేశ్వరరావు, గోనుగుంట్ల శివ, పోపూరి వెంకయ్య తదితరులు ఉన్నారు. కాగా 2024లో చిలకలూరిపేట అర్బన్ పోలీసు స్టేషన్ లో నమోదైన మరొక కేసుకు సంబంధించి కూడా ప్రత్తిపాటితో పాటు మరో 29 మంది సీనియర్ టీడీపీ నాయకులు కోర్టుకు హాజరయ్యారు. అప్పటి మంత్రి విడదల రజిని మరిది అయిన విడదల గోపీ, అతని అనుచరులు, పలువురు వైసీపీనేతలు కోటప్పకొండ వద్ద టీడీపీ నేతలు, కార్యకర్తలతో ఘర్షణకు పాల్పడిన అనంతరం చిలకలూరిపేట అర్బన్ పోలీసు స్టేషన్ వద్ద జరిగిన ఘటనపై టీడీపీనేతలు, కార్యకర్తలతో పాటు ప్రత్తిపాటిపై కూడా కేసు నమోదయింది. ఈ కేసులో ఉన్న మొత్తం 30 మంది విచారణకు హాజరయ్యారు. వీరిలో సీనియర్ టీడీపీ నాయకులు నెల్లూరి సదాశివరావు, షేక్ కరీముల్లా, తుబాటి శ్రీహరి, పిల్లి కోటి, బుచ్చిబాబు, మారెళ్ళ అప్పారావు, స్టీఫెన్ కరుణాకర్ తదితరులు ఉన్నారు. కోర్టులో ప్రత్తిపాటి, ఆయన అనుచరుల తరపున న్యాయవాదులు ఈపూరి బ్రహ్మానందం, తుబాటి పూర్ణచంద్రరావు, జీవిహెచ్ ప్రసాద్, టీడీపీ లీగల్ టీమ్ విచారణకు హాజరయ్యారు.



మరో విద్యుత్ పోరాటానికి సిద్ధం కావాలి

● సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు



సభలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు తదితరులు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ అమరవీరుల పోరాటస్ఫూర్తితో ప్రజలు మరో విద్యుత్ పోరాటానికి సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు అన్నారు. గురువారం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణంలోని గాంధీ పార్కు వద్ద బషీర్‌బాగ్ విద్యుత్ అమరవీరుల నివాళి, సంస్మరణ సభ జరిగింది. ఉద్యమంలో అమరులైన విష్ణువర్ధన్ రెడ్డి, రామకృష్ణ, బాలస్వామి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ముప్పాళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ 2000 సంవత్సరంలో విద్యుత్ చార్జీల వ్యతిరేక ప్రదర్శన సందర్భంగా బషీర్‌బాగ్ వద్ద పోలీసులు జరిపిన కాల్పుల ఘటన జరిగి 25 ఏళ్ళు గడిచిందన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరిట రూ.32 వేల కోట్లు ప్రజలపై భారాలు వేసిందని, విద్యుత్ సంస్థకు చెల్లించాల్సిన రూ.1.25లక్షల కోట్లు చెల్లించకుండా స్మార్ట్‌మీటర్ల పేరుతో ప్రజలపై భారాలు వేసేందుకు కుట్రలు పన్నిందన్నారు. కూటమి ప్రభుత్వంలో భాగస్వాములైన బీజేపీ తీసుకువచ్చిన విద్యుత్ సంస్కరణలను టీడీపీ, జనసేన ప్రశ్నించడం లేదని, రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు పెట్టి ప్రజలపై భారాలు మోపుతున్నారని విమర్శించారు. సంస్మరణ సభకు సీపీఎం నరసరావుపేట మండల కార్యదర్శి డీ శివకుమారి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ మారుతి వరప్రసాదు, సహాయ కార్యదర్శి కాసా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతుల కోసం ఏఎన్ఎంల నిరసన



గుంటూరు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఏఎన్ఎంలు

గుంటూరు సిటీ, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన 34 మంది సచివాలయం ఏఎన్ఎంలు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం వద్ద గురువారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఆరు నెలల క్రితం జిల్లాలో గ్రేడ్-3 ఏఎన్ఎంలకు గ్రేడ్-2 గా ప్రమోషన్‌లు ఇచ్చారు. అప్పట్లో మొత్తం 300మందితో ప్రమోషన్‌ల జాబితా రూపొందించారు. అయితే ఆ రోజు కేవలం 266మందికి మాత్రమే ప్రమోషన్ ఇచ్చారు. మిగిలిన వారికి పది రోజుల్లో ప్రమోషన్‌లు ఇస్తామని చెప్పి పంపారు. ఆరు నెలలు దాటిన తరవాత ప్రమోషన్‌లు ఇస్తాం రమ్మని చెప్పి జిల్లా అధికారులు 34మంది అర్హులైన ఏఎన్ఎంలను గుంటూరులోని కార్యాలయానికి పిలిపించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాచిన తరవాత ఇప్పుడు ప్రమోషన్‌లు ఇవ్వటం లేదని అధికారులు చెప్పటంతో ఆగ్రహించిన ఏఎన్ఎంలు జిల్లా అధికారి కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ జనరల్ పోస్టులకు కొత్తగా ఆర్ఓఆర్ తయారుచేయాలని అధికారులు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతి

పొన్నూరు టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని నిడుబ్రోలు రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గురువారం రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం నిడుబ్రోలు రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం గురించి స్థానికులు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న బాపట్ల రైల్వే పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి శవ పరీక్షల నిమిత్తం తరలించారు. అయితే గుర్తు తెలియని వ్యక్తి ప్రమాదవశాత్తూ మృతి చెందాడా లేక ఆత్మహత్య చేసుకున్నాడా అనే విషయంపై రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బీఫార్మసీ విద్యార్థి ఆత్మహత్య

● కళాశాల ఎదుట మృతదేహంతో ఆందోళనకు యత్నం
● అడ్డుకున్న పోలీసులు



సూర్య (ఫైల్)

మేడికొండూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మేడికొండూరు మండలం జంగంగుంట్లపాలెం పరిధిలోని ఒక బీఫార్మసీ కాలేజీలో చదువుతున్న విద్యార్థి బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విద్యార్థి మృతికి కళాశాల అసిస్టెంట్ ప్రిన్సిపాల్ కారణమని ఆరోపిస్తూ గురువారం విద్యార్థి మృతదేహంతో కళాశాల ఎదుట బంధువులు ఆందోళనకు ప్రయత్నించారు. పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం అంబటిపూడికి చెందిన తాళ్లూరి సూర్య జంగంగుంట్లపాలెంలోని బీఫార్మసీ కాలేజీలో మూడో సంవత్సరం చదువుతున్నాడు. సత్తెనపల్లిలోని సోషల్ వెల్ఫేర్ హాస్టల్లో ఉంటూ కళాశాలకు వచ్చి వెళుతున్నాడు. కళాశాలలో జూనియర్ విద్యార్థినితో సూర్య మాట్లాడుతుండడాన్ని గమనించిన అసిస్టెంట్ ప్రిన్సిపాల్ హెచ్చరించారు. అయినా సూర్య ఆ విద్యార్థినితో మాట్లాడుతుంటడాన్ని సీరియస్‌గా తీసుకున్న అసిస్టెంట్ ప్రిన్సిపాల్, సూర్యని గట్టిగా మందలించాడు. తీవ్ర మనస్థాపానికి గురైన సూర్య తానుంటున్న హాస్టల్లో బుధవారం పురుగుమందుతాగి స్పృహతప్పి పడిపోయాడు. ఇతనిని గమనించిన సహచర విద్యార్థులు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మరణించాడు. విద్యార్థి మరణానికి కళాశాల అసిస్టెంట్ ప్రిన్సిపాల్ కారణమని ఆరోపిస్తూ విద్యార్థి బంధువులు గురువారం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిని నుండి మృతదేహాన్ని గ్రామానికి తరలిస్తూ మార్గమధ్యంలో కళాశాల వద్ద మృతదేహాన్ని ఉంచి ధర్నాకు ప్రయత్నించారు. సమాచారాన్ని ముందుగానే తెలుసుకున్న పోలీసులు కళాశాల వద్దకు చేరుకొని ధర్నా ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇవ్వటంతో మృతదేహాన్ని అక్కడి నుంచి తరలించారు.

సర్వేపల్లి రాధాకృష్ణన్ అవార్డుకు గౌరీనాథం ఎంపిక



జీ గౌరీనాథం

మాచవరం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 5వ తేదీ ఇవ్వనున్న సర్వేపల్లి రాధాకృష్ణన్ అవార్డుకు గొల్లపల్లి గౌరీనాథం ఎంపికైనట్టు సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్, టీచర్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పీ నాగయ్య, గౌరవ అధ్యక్షుడు, మాజీ ఎంఎల్‌సీ కేఎస్ లక్ష్మణరావు గురువారం తెలిపారు. గౌరీనాథం ప్రైవేట్ ఉపాధ్యాయుడిగా, అధ్యాపకుడిగా అనేక విద్యాసంస్థల్లో పనిచేసి అనేకమంది విద్యార్థులను తీర్చిదిద్దటంలో చేసిన కృషికి ఫలితంగా ఈ అవార్డుకు ఎంపికైనట్టు తెలిపారు. ఈనెల 31న గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో అవార్డు అందజేస్తారని తెలిపారు. గౌరీనాథం స్వస్థలం మాచవరం మండలం గంగిరెడ్డిపాలెం గ్రామం. ఈయన ప్రస్తుతం తమిళనాడులోని ఎస్ఆర్‌వీ ఇంటర్నేషనల్ స్కూల్లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

జాతీయ ప్రతిభా పురస్కారానికి నరసింహారావు..



చింతల నరసింహారావు

● పిడుగురాళ్ల: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ ప్రతిభా పురస్కారానికి స్థానిక ఎస్టీ జోసఫ్ బాలికల హైస్కూల్‌కు చెందిన ఉపాధ్యాయుడు చింతల నరసింహారావు ఎంపికైనట్లు హెచ్ఎం సిస్టర్ రాణి తెలిపారు. ఈ సందర్భంగా నరసింహారావుకు పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

అత్యాచారం కేసులో నిందితులకు రిమాండ్

నరసరావుపేట లీగల్, రొంపిచర్ల, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఓ వివాహితను అత్యాచారం చేసిన కేసులో నిందితులైన రొంపిచర్ల మండలం సంతగుడిపాడు గ్రామానికి చెందిన గుడిపాటి పుల్లారావు, ఉయ్యాల శివయ్యలకు రిమాండ్ విధిస్తూ స్థానిక రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఇన్‌చార్జి న్యాయ అధికారి ఏ సలోమి గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఈనెల 25వ తేదీన నిందితులు తనపై అత్యాచారానికి పాల్పడినట్లు బాధితురాలు రొంపిచర్ల పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు పోలీసులు ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం, గ్యాంగ్ రేప్ చట్టాల కింద కేసు నమోదు చేశారు. ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితులను గురువారం అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరు పరచగా రిమాండ్ విధించారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తుల అరెస్టు

తెనాలి క్రైం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఒరిస్సా రాష్ట్రంలో గంజాయి తక్కువ ధరలలో కొనుగోలు చేసి తెనాలిలో వాటిని అమ్ముతున్న ఐదుగురు సభ్యుల ముఠాను తెనాలి త్రీ టౌన్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. సీఐ రమేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం... తెనాలి బాలాజీరావుపేట మహేంద్ర కాలనీకి చెందిన పాలడుగు బాలకృష్ణ (42) పట్టణంలోని గంగానమ్మపేట, మసీదు ప్రాంతానికి చెందిన సయ్యద్ మొహజాహిద్ (26) ఇద్దరూ కలసి ఒరిస్సా రాష్ట్రంలోని పెదపాకాలలో గుర్తుతెలియని వ్యక్తుల నుంచి గంజాయి కొనుగోలు చేసి తెనాలిలో అధిక ధరలకు అమ్మకాలు సాగిస్తున్నారు. వారితో పాటు మరో ముగ్గురు ముఠాసభ్యులు అమృతలూరు మండలం కూచిపూడికి చెందిన పోతార్లంక కార్తీక్ (20), బాలారావుపేటకు చెందిన యలవర్తి శివకుమార్ (30), చెంచుపేట అనిబీసెంట్ స్కూల్ ప్రాంత వాసి షేక్ సమీర్ హుస్సేన్ (27)లు కలసి బాలాజీరావుపేటలో మస్తానమ్మతోటకు చెందిన ఖాళీప్రదేశం పొదల మధ్య గంజాయి అమ్మకాలు చేస్తున్నారు. అంతేకాకుండా గంజాయి సేవిస్తున్న ఈ ముఠా కూడా అక్కడే దాగి ఉందన్న సమాచారంతో ఆకస్మికంగా దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద 1.150 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎన్‌డీపీఎస్-1985 యాక్టు ప్రకారం అరెస్టుచేసి కోర్టులో ప్రవేశ పెట్టినట్లు సీఐ తెలిపారు. దాడుల్లో పి.మురళి, డి.సురేష్, ఎస్ఐ జైకర్, అబ్దుల్ సలాంను డీఎస్పీ జనార్దనరావు అభినందించారు.



గంజాయి ముఠాను అరెస్టు చూపుతున్న తెనాలి త్రీ టౌన్ పోలీసులు

46,264 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 45,242 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 46,264 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 10,315 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	10000	14300
నంబరు. 5	10000	13500
273	--	--
341	10000	15200
4884	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	--	--
షార్క్-1	10000	15200
బ్యాడిగి 355	--	--
సింజెంటా బ్యాడిగి 5531	10000	14600
దేవనూరు డీలక్స్	--	--

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఆర్మూరు	10000	13800
ఏసీ కామన్ వెరైటీ		
334	10500	14000
నంబరు. 5	10000	13600
341	11000	15500
4884	10000	13000
ఏసీ స్పెషల్ వెరైటీ		
షార్క్-1	10000	15400
బ్యాడిగి 355	--	--
సింజెంటా బ్యాడిగి 5531	10000	14000
దేవనూరు డీలక్స్	--	--
తాలుకాయలు	5000	7500



నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ఫ్యాక్టరీ ఫ్లోర్ సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	106, 114, 125
చికెన్ విత్ స్కిన్(కిలో)	204.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	214.00

అర్హత లేని వారికి టెండర్లు



రామాంజనేయులుతో వాగ్వాదానికి దిగిన వైసీపీ కార్పొరేటర్లు

(5వ పేజీ తరువాయి)

అభివృద్ధి దెబ్బతింటోందన్నారు. ఎన్ని సార్లు చెప్పినా పద్ధతి మార్చుకోరా.. మేము అడిగిన ప్రశ్నలకు.. ఇచ్చే సమాధానాలకు పొంతన ఉండదా అంటూ పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి అధికారులపై మండిపడ్డారు. ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం ప్రదర్శించడం అంటే ప్రజలను మోసం చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. కుక్కల దాడికి చిన్నారులు, వృద్ధులు బలవుతున్నా నిర్లక్ష్యం వీడటం లేదని మాధవి ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలో హోర్డింగ్‌లను ఒక్క సంస్థకే ఎలా కట్టబెడతారని, స్ట్రక్చరల్ సర్టిఫికెట్ లేకుండా ఎలా ఎంపిక చేస్తారని సభ్యులు ప్రశ్నించారు. నడిరోడ్డుపై హోర్డింగ్‌లు ప్రమాదకరంగా ఉన్నా చర్యలు తీసుకోవడంలో జాప్యం ఎందుకు చేస్తున్నారన్నారు. అనుమతి లేని అనధికార హోర్డింగ్‌లను పది నుంచి 15 రోజుల్లోపు తొలగిస్తామని సీపీ రాంబాబు హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని రెండు శ్మశాన వాటికల గురించి ఎనిమిది నెలలుగా అడుగుతున్నా పనులు అసంపూర్తిగా ఉన్నాయని రెండు నెలల్లో పూర్తి చేయాలని తూర్పు ఎమ్మెల్యే నసీర్ డిమాండ్ చేశారు. పాతగుంటూరు శ్మశాన వాటికలో రూ.కోటితో ఏర్పాటు చేసిన యంత్రం నిరుపయోగంగా ఉన్నా ఎందుకు పట్టించుకోవట్లేదని అధికారులను ప్రశ్నించారు. సచివాలయాల క్రమబద్ధీకరణ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలన్నారు. నగరాన్ని ఐదు జోన్లుగా విభజించి హోర్డింగ్‌లను ప్రైవేటు వారికి అప్పగించాలన్నారు.

వైసీపీ కార్పొరేటర్లు వర్సెస్ ఏసురత్నం

సభా మర్యాదలను కాపాడాలని.. అవకాశం ఇచ్చినప్పుడు మాత్రమే మాట్లాడాలని వైసీపీ కార్పొరేటర్లపై ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమయంలో ఎమ్మెల్సీ ఏసురత్నం జోక్యం చేసుకుని గొడవ చేస్తే నడవదు.. ముందు వినండి.. తర్వాత మాట్లాడదాం అని వైసీపీ కార్పొరేటర్లపై అసహనం వ్యక్తం చేశారు. వైసీపీ పాలనలో అవినీతి జరిగిందంటూ పరోక్షంగా విమర్శలు చేయడంతో ఏసురత్నంను వైసీపీ కార్పొరేటర్లు చుట్టుముట్టి గందరగోళం చేశారు. జగనన్న కాలనీల్లో జరిగిన అవినీతిపై విచారణ కమిటీ వేయాలని రామాంజనేయులు డిమాండ్ చేశారు. సమావేశంలో మొత్తం 131 అంశాలకు ఆమోదం తెలిపారు. ఎన్‌టీఆర్ మానస సరోవరాన్ని పీపీపీ మోడ్ పద్ధతిలో అభివృద్ధి చేయాలని తీర్మానించారు. నగరాన్ని ఐదు జోన్‌లుగా విభజించి హోర్డింగ్‌లను, ప్రైవేటు ఏజెన్సీ సంస్థలకు అప్పగించాలని తీర్మానించారు. సమావేశంలో కమిషనర్ పులి శ్రీనివాసులు, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

165 యూరియా బస్తాలు స్వాధీనం

దాచేపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా కారంపూడి నుంచి తెలంగాణలోని కొత్తగూడేనికి తరలిస్తున్న 165 బస్తాల ఎరువులను గురువారం తెల్లవారు జామున దాచేపల్లి మండలం పొందుగుల పోలీసు చెక్‌పోస్టు వద్ద అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం కాంచనపల్లి గ్రామానికి చెందిన సఖిల సురేష్ తదితరులు కారంపూడి నుంచి 165 యూరియా బస్తాలను రెండు వాహనాల్లో తరలిస్తుండగా పొందుగుల పోలీసు చెక్‌పోస్టు వద్ద సాధారణ తనిఖీల్లో పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసిన విజిలెన్స్, పోలీసు, వ్యవసాయశాఖ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నారై మెడికల్ కళాశాలకు శరీర దానం



గోగినేని రాకుమారి (ఫైల్‌ఫొటో)

వేమూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని చంపాడు గ్రామానికి చెందిన గోగినేని రాకుమారి(70) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆమె పార్థివదేహాన్ని ఎన్నారై మెడికల్ కళాశాలకు భర్త సుబ్బారావు, కుమార్తె లక్ష్మీ దానం చేశారు. ఎన్‌ఆర్‌ఐ వైద్య కళాశాల అధికారులు అంబులెన్స్ ద్వారా రాకుమారి పార్థివదేహాన్ని కళాశాలలోని అనాటమీ విభాగానికి తరలించారు. ఆమె నేత్రాలను పెదకాకాని ఐ బ్యాంకుకు దానం చేశారు. నేత్రాలు ఇద్దరికి చూపు కల్పించడానికి ఉపయోగపడతాయని ఐ బ్యాంకు ప్రతినిధులు తెలిపారు. పార్థివదేహం ఒకటి, రెండు సంవత్సరాల పాటు వైద్య పరీక్షల పాఠ్యాంశాల బోధనకు దోహదపడుతుందని ఎన్నారై మెడికల్ అధికారులు తెలిపారు. రాకుమారి మృతి అనంతరం ఆమె భర్త, కుమార్తె తీసుకున్న నిర్ణయానికి గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

నగరంలో పండుగ వస్త్రాల కొనుగోళ్ల సంబరాలు

● శుభం కన్వెన్షన్ సెంటర్‌లో నేషనల్ సిల్క్ ఎక్స్ పో ప్రారంభం



చీరల ప్రదర్శనలో యువతి

గుంటూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రాబోయే వరుస పండుగలు, వివాహాది వేడుకలకు అద్భుతమైన ప్రత్యేక వస్త్రాల ప్రదర్శన, అమ్మకాల కోసం రింగ్‌రోడ్డులోని శుభం కన్వెన్షన్ సెంటర్‌లో నేషనల్ సిల్క్ ఎక్స్ పోను గురువారం ప్రారంభించారు. ఈ ప్రదర్శన ఈనెల 28 నుంచి సెప్టెంబర్ 2 వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దసరా, దీపావళితో పాటు వివాహాది వేడుకలకు అవసరమైన సంప్రదాయ, ఆధునిక ఫ్యాషన్ల సమ్మిళితమైన విభిన్న వస్త్రాలను ఈ ప్రదర్శనలో ఉంచినట్లు పేర్కొన్నారు. నేషనల్ సిల్క్ ఎక్స్‌పో-ఎగ్జిబిషన్ కమ్ సేల్ సందర్శన షాపింగ్ చేయటంలో ఒక గొప్ప అనుభూతి కలిగించనున్నదని తెలిపారు. ఈ ప్రదర్శనలో దేశంలోని వివిధ చేనేత వస్త్ర సంపదను అంతటిని ఇక్కడే చూడవచ్చు. వేలాది రకాల పట్టు, కాటన్ డిజైన్ వస్త్రాలు, డిజైనర్ చీరలు, బ్లౌజులు, కుర్తీలు మొదలైన వాటిని దేశంలోని వివిధ రాష్ట్రాల నేత కార్మికులు 50 శాతం వరకు తగ్గింపు ధరలకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. ప్రదర్శన ప్రతి రోజు ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు సందర్శకులకు అందుబాటులో ఉంటుందన్నారు. కొనుగోలుదారులకు ఉచిత ప్రవేశమని, అన్ని డెబిట్, క్రెడిట్ కార్డుల చెల్లింపులు కూడా స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

'అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్'కు ఆర్వీఆర్ అండ్ జేసీ విద్యార్థులు

గుంటూరు (విద్య) ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) 'అమరావతి క్వాంటమ్ వ్యాలీ' నిర్మాణానికి విద్యార్థులు అద్భుత సాంకేతిక ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని ప్రముఖ సాంకేతిక నిపుణులు ప్రొఫెసర్ డాక్టర్ కె.శ్రీనివాస్ అన్నారు. క్వాంటమ్ టెక్నాలజీలకు ప్రపంచ కేంద్రంగా అమరావతిని మార్చాలనే లక్ష్యంతో ఏపీ ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న "అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్" పోటీలకు ఆర్వీఆర్ అండ్ జేసీ విద్యార్థులను సిద్ధం చేయడానికి, కళాశాలలో గురువారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. క్వాంటమ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, బ్లాక్‌చెయిన్ వంటి సాంకేతిక విభాగాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో సృజనాత్మక పరిష్కారాలను చూపడంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎన్వి శ్రీనివాసరావు, డైరెక్టర్ ఆర్ అండ్ డి డాక్టర్ కే రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.



శిక్షణకు హాజరైన ఆర్వీఆర్ అండ్ జేసీ విద్యార్థులు

విద్యుత్ అమరవీరుల పోరాటాలను కొనసాగించాలి

గుంటూరు(తూర్పు), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): విద్యుత్ అమరవీరుల పోరాట బాటను కొనసాగించటమే వారికి నిజమైన నివాళులని వామపక్ష నాయకులు అన్నారు. గురువారం లాడ్జి సెంటర్లోని అంబేద్కర్ విగ్రహం వద్ద వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో విద్యుత్ అమరవీరుల నివాళుల కార్యక్రమం జరిగింది. సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకర్ రెడ్డి, జంగాల అజయ్ కుమార్‌లు మాట్లాడుతూ నాటి జరిగిన పోరాటం ఫలితంగా వచ్చిన ప్రభుత్వాలు విద్యుత్ భారాలు వేసేందుకు వెనకాడాయని తెలిపారు. తిరిగి 20 ఏళ్ల తరువాత కేంద్ర బీజేపీ ప్రభుత్వ ఒత్తిడితో గత వైసీపీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వాలు విద్యుత్ భారాలను ప్రజలపై మోపేందుకు సిద్ధమయ్యాయని విమర్శిం చారు. అనంతరం విద్యుత్ పోరాటంలో ప్రభుత్వ పోలీసు ధమనకాండలో మరణించిన విష్ణువర్ధన్‌రెడ్డి, రామకృష్ణ, బాలస్వామి ఫోటోలకు పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి సీపీఎం, సీపీఐ నగర కార్యదర్శులు కె నళినికాంత్, అరుణ్ కుమార్ అధ్యక్షత వహించగా, కార్యక్రమంలో మాల్యాద్రి, ఉల్లిగడ్డ నాగేశ్వరరావు, నాగలక్ష్మి, కోటేశ్వరరావు, ఎన్ భావన్నారాయణ, బీ ముత్యాలరావు, ఎంఏ చిష్టి, సుధాకిరణ్ పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలకు హ్యాక్‌థాన్ దోహదం

● మలినేని విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ పెరుమాళ్ళు



సదస్సులో ప్రసంగిస్తున్న డాక్టర్ పెరుమాళ్ళు

వట్టిచెరుకూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో నూతన ఆవిష్కరణలు, పరిశోధనాత్మక ఆలోచనలు, భవిష్యత్ సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించే లక్ష్యంగా ఈ హ్యాక్‌థాన్ నిర్వహించినట్టు మలినేని విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ పెరుమాళ్ళు అన్నారు. మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం రాష్ట్ర ప్రభుత్వం అమరావతి క్వాంటమ్ వ్యాలీ ప్రోగ్రాంకు మద్దతుగా క్వాంటమ్ కంప్యూ టింగ్‌పై ఇంటర్నేషనల్ హాక్‌థాన్‌ను విజయవంతంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ పెరుమాళ్ళు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యువత భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని అత్యంత ఆధునాతన సాంకేతికతపై కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో మొత్తం 25 జట్లు పాల్గొనగా జ్యూరీ సభ్యులు మొత్తం ప్రాజెక్టులను పరిశీలించి ఐదు జట్లను విజేతలుగా ప్రకటించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వరరావు, కళాశాల డీన్ డాక్టర్ పీ రమేష్ బాబు, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ జీ.రామస్వామి, ఇతర విభాగాధిపతులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్లో పరిశుభ్రత పాటించాలి : కమిషనర్

గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్నక్యాంటీన్లలో పరిశుభ్రత పాటిస్తూ, ఆహారం నిర్దేశిత సమయపాలన పాటిస్తూ అందించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అక్షయ పాత్ర సిబ్బందిని ఆదేశించారు. గురువారం పల్నాడు బస్టాండ్ దగ్గరలోని అన్న క్యాంటీన్ ని కమిషనర్ పరిశీలించి, ఆహారం తీసుకుంటున్నవారితో మాట్లాడి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు.

గురువారం ఏటి అగ్రహారం, అంకమ్మ నగర్, కంకరగుంట ఆర్యూబి, బ్రాడిపేట, అరండల్ పేట తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్యం, అభివృద్ధి పనులను పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున అంతర్గత డ్రైన్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం ద్వారా డ్రైన్లు పొంగే సమస్య రాకుండా చూడాలన్నారు. డ్రెయిన్లలో మురుగుపారుదలకు అడ్డుగా ఉన్న ఆక్రమణలను తొలగించాలని పట్టణ ప్రణాళిక కార్యదర్శులను ఆదేశించారు. ఆయన వెంట డిఈఈ వెంకటరమణ, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు ఉన్నారు.

మతాన్ని ప్రజాస్వామీకరించిన తత్వవేత్త నారాయణ గురు

● మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాదు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మతాన్ని ప్రజాస్వామీకరించిన గొప్ప తత్వవేత్త నారాయణ గురు అని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాదు కొనియాడారు. అరండల్‌పేట, అమరావతి బుక్ హౌస్‌లో చార్వాక యువజన సంఘం అధ్యక్షుడు చిన్నం డేవిడ్ విలియం అధ్యక్షతన జరిగిన నారాయణ గురు జయంతి సభలో ఆయన ప్రసంగించారు. ప్రజల మత విశ్వాసాలను పరిగణలోకి తీసుకొని గుడిని, బడిని అభివృద్ధి చేసి అట్టడుగు కులాలను అందజేసిన ఘనత నారాయణ గురుకే దక్కిందని గుర్తు చేసుకున్నారు. నారాయణ గురు శంకరాచార్య అద్వైతాన్ని తీసుకొని సమాజాన్ని ప్రజాస్వామీకరించేందుకు కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మూకిరి సుధ, తమతా కోటేశ్వరరావు, హైకోర్టు న్యాయవాది సంజీవరెడ్డి, భీమ్ సేవా సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపు నీలాంబరం తదితరులు పాల్గొన్నారు.

రోగులకు నగదు రహిత వైద్య సేవలు అందించాలి

● కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో రోగులకు నగదు రహిత వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని డీఆర్‌సీ మీటింగ్ హాల్‌లో ఆస్పత్రులకు సంబంధించి జిల్లా క్రమశిక్షణ కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో మొత్తం 87 ఫిర్యాదులపై విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా ఆస్పత్రుల్లో రోగుల వైద్య సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చఊడాలన్నారు. అత్యవసర వైద్య సేవల విభాగంలో డాక్టర్లు తప్పనిసరిగా ఉండాలని, లేకుంటే కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఈహెచ్‌ఎస్ పథకం కింద ఉద్యోగులు, పెన్షనర్లు నెట్‌వర్క్ ఆస్పత్రులకు వచ్చినప్పుడు వైద్య సేవలు తిరస్కరించకుండా తగిన వైద్యం సకాలంలో అందించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో డాక్టర్ ఎన్‌టీఆర్ వైద్య సేవ పథకం కింద చికిత్స పొందే రోగులకు ఆయా హాస్పిటల్స్‌కి అనుసంధానంగా ఉండే సెంటర్స్‌కి మాత్రమే పరీక్షల నిమిత్తం పంపించాలని, మరే ఇతర కేంద్రాలకు పంపరాదన్నారు. ఎవరైనా రోగుల పరీక్షలకు, ఔషధాలకు డబ్బులు కడితే తిరిగి ఆ నగదుని వైద్య మిత్ర సమక్షంలో ఇవ్వాలని ఆదేశించారు. ఎవరైతే నగదు వసూలు చేశారో ఆయా ఆస్పత్రులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలన్నారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ కే విజయలక్ష్మి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రంగారావు, రెడ్‌క్రాస్ వైస్‌చైర్మన్ పీ రామచంద్రరాజు, ఎన్‌టీఆర్ వైద్య సేవ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ విజయప్రకాష్ పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ల వద్ద పటిష్ట బందోబస్తు

గుంటూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు మాస తనిఖీలలో భాగంగా గురువారం ఉదయం గుంటూరు కలక్టరేట్ ఆవరణలోని ఈవీఎంలు భద్రపరిచిన గోడౌన్‌ను కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి పరిశీలించారు. సీసీ టీవీ పనితీరు, అగ్నిమాపక పరికరాలను పరిశీలించారు. గోడౌన్ పరిశీలించినట్లుగా విజిటర్స్ బుక్‌లో సంతకం చేశారు. ఆమె వెంట డీఆర్‌ఓ షేక్.ఖాజావలి, గుంటూరు ఆర్డీవో కే శ్రీనివాస రావు, అడిషనల్ ఫైర్ ఆఫీసర్ కృష్ణారెడ్డి, ఆర్ అండ్‌బీ సివిల్ డిఈఈ ఏ నాగేశ్వర రావు, ఆర్‌అండ్‌బీ ఎలక్ట్రికల్ ఏఈ శ్రీరామ మూర్తి, గుంటూరు పశ్చిమ మండల తహశీల్దార్ వెంకటేశ్వర్లు, ఎలెక్షన్ సెక్షన్ పర్యవేక్షకురాలు మల్లేశ్వరి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రూ. 30 వేలు లంచం తీసుకుంటూ... ఏసీబీకి పట్టుబడిన పరిశ్రమల శాఖ అధికారి



ఏసీబీకి పట్టుబడిన పరిశ్రమల శాఖ అధికారి శ్రీనివాసరావు

గుంటూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : దళితుల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జేబీవీ పథకం ద్వారా ఇన్నోవా వాహనం మంజూరు చేసినందుకు రూ.లక్ష డిమాండ్ చేసి రూ.30 వేలు లంచం తీసుకుంటూ పరిశ్రమల శాఖ అధికారి మత్తి శ్రీనివాసరావు గురువారం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఏసీబీ అదనపు ఎస్పీ మత్తే మహేంద్ర కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరు నగర శివారు గోర్లవారిపాలేనికి చెందిన తియ్యల జయరాజ్ జగనన్న బడుగు వికాసం (జేబీవీ) పథకం కింద 2024లో ఇన్నోవా వాహనం కోసం దరఖాస్తు చేసుకున్నారు. గత జూన్‌లో ప్రభుత్వం వాహనాన్ని జయరాజుకు కేటా యించింది. రూ.36 లక్షల ఖరీదైన ఈ వాహనానికి ప్రభుత్వం రూ.13 లక్షలు సబ్సిడీ ఇవ్వనుంది. అయితే జయరాజును ఈ పథకానికి ఎంపిక చేసి వాహనం మంజూరు అయ్యేలా చేసినందుకు గాను తనకు లక్ష లంచం ఇవ్వా లని పరిశ్రమల శాఖ అధికారి మత్తి శ్రీనివాస రావు డిమాండ్ చేశారు. పరిశ్రమల శాఖ అధికారి శ్రీనివాస రావును జయరాజ్ కలిసి రెండు విడత లుగా ఆ మొత్తం ఇస్తానని తొలివిడత రూ.30 వేలు ఇస్తానని బేరం కుదుర్చుకున్నాడు. లంచం ఇవ్వడం ఇష్టం లేని జయరాజు తన మేనమామ అయిన మంగళగిరి మండలం నిడమర్రుకు చెందిన మండేపూడి కమలాకర్ ద్వారా ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. కాగా జిల్లా పరిషత్ కాంపౌండ్‌లో రూ.30 వేలు లంచం తీసుకునేందుకు అధికారి శ్రీనివాస రావు నిర్ణయించుకున్నాడు. ఇలాఉంటే మాచర్ల ప్రాంతానికి చెందిన శ్రీనివాసరావు స్నేహితుడు గురువారం జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ క్రిస్టినాను కలిసేందుకు కారులో వచ్చారు. అక్కడకు వచ్చిన శ్రీనివాసరావు తన స్నేహితుడి కారు తాళాలు తీసుకొని కారులో కూర్చున్నాడు. ఆయన స్నేహితుడు జడ్పీ చైర్‌పర్సన్ వద్దకు వెళ్లారు. ఈలోగా జయరాజు మేనమామ కమలాకర్‌రావు నుంచి పరిశ్రమల శాఖ అధికారి శ్రీనివాసరావు తన స్నేహితుడి కారులో కూర్చొని రూ.30 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అవినీతి నిరోధక శాఖ జిల్లా అదనపు ఎస్పీ మత్తే మహేంద్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడిలో ఏసీబీ సీఐలు నాగరాజు, సుబ్బారావు, మన్మధరావు, సురేష్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు. పట్టుబడిన శ్రీనివాసరావుపై కేసు నమోదు చేశామని, శుక్రవారం ఆయనను విజయవాడలోని ఏసీబీ కోర్టులో హాజరు పరచనున్నట్లు మహేంద్ర తెలిపారు.

నగరంలో ఆధ్యాత్మిక శోభ

● భక్తి శ్రద్ధలతో వినాయకచవితి ఉత్సవాలు
● వీధి, వీధిన కొలువుదీరిన గణనాథులు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): వీధి, వీధిన ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుని ప్రతిమలు, ఇంటింటా కొలువుదీనిన బొజ్జ గణపయ్య వేడుకలతో నగరం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ముఖ్యంగా కాలనీల్లో, అపార్టుమెంట్‌లలో, వీధి, వీధిన ఏర్పాటు చేసిన విగ్రహాలు ఆకట్టుకున్నాయి. ఆర్ అగ్రహారం కన్యకా పరమేశ్వరీ అమ్మవారి దేవస్థానం ఆవరణలో వాసవీ యూత్ ఆధ్వర్యంలో శ్రీ విజయ గణపతి నవరాత్రోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. పాతగుంటూరు, బూరెలవారి వీధి, నల్లచెరువు, డీఎస్ నగర్, సంగడిగుంట, మాయాబజార్, క్లాత్ బజార్, డొంకరోడ్డు, బృందావన్‌గార్డెన్స్, ఎస్ వి ఎన్ కాలనీ, నవభారత్‌నగర్, లక్ష్మీపురం, కొరిటెపాడు, అమరావతి రోడ్డు తదితర ప్రాంతాలతో పాటు పలు అపార్ట్‌మెంట్‌లలో ఏకదంతుని విగ్రహాలు ఏర్పాటు చేసి పూజలు నిర్వహిస్తున్నారు. స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటి ఆధ్వర్యంలో వినాయకచవితి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. బృందావన్ గార్డెన్స్ ధార్మిక ప్రాంగణంలో గణేష్ ఉత్సవమండలి నిర్వహణలో బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతుల ఆధ్వర్యంలో భక్తి, శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. మల్లారెడ్డినగర్ శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయంలో ఏం కే ఆర్ ఫౌండషన్ చైర్మెన్ మల్లారెడ్డి ఆధ్వర్యంలో వినాయకచవితి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి.

కార్యశిద్ధి గణపతికి దేగల ప్రభాకర్ పూజలు



గణేశుడికి పూజలు చేస్తున్న దేగల ప్రభాకర్

గుంటూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): గుంటూరు నాజ్ సెంటర్లోని ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్ నందు నిర్వహించిన కార్యసిద్ధి మహాశక్తి గణపతి విగ్రహానికి చైర్మన్ దేగల ప్రభాకర్, సతీమణి దేగల భువనేశ్వరి ప్రత్యేక పూజాలు నిర్వహించారు. బొజ్జ గణపయ్యకు పట్టు వస్త్రాలు సమర్పించారు. విఘ్నాలు లేకుండా రాష్ట్ర అభివృద్ధికి దైవాశీస్సులు ఉండాలని, విఘ్నేశ్వరుడి కరుణా కటాక్షాలతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. కార్యక్రమంలో హాస్పిటల్ డాక్టర్లు, హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


● గుంటూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఏటుకూరు రోడ్డులోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం ఎదుట వాసవీ యూత్ ఆధ్వర్యంలో 19 అడుగుల భారీ విగ్రహం అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇక చుట్టుగుంట సెంటర్‌లో సాయివిల్లా అపార్ట్‌మెంట్స్ ఆధ్వర్యంలో 10 అడుగుల విగ్రహంతో చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అలానే నల్లచెరువు, ఏటి అగ్రహారం, శ్రీనివాసరావుపేట, చుట్టుగుంట, పాతగుంటూరు, అమరావతి రోడ్డు,బృందావన్‌గార్డెన్స్, గుజ్జనగుండ్ల, ఎస్‌వీఎన్ కాలనీ ప్రాంతాల్లో భారీ గణనాధుల విగ్రహాలను ఏర్పాటు చేశారు.

99 అడుగుల గణనాథుడు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఖైరతాబాద్ మాదిరిగానే 99 అడుగుల భారీ గణపతి కొలువ దీరాడు. వినాయక చవితిని పురస్కరించుకొని గుంటూరు, ఇన్నర్‌రింగు రోడ్డులో అమరావతి ఉత్సవ కమిటి ఆధ్వర్యంలో, గంగా, కృష్ణా నదుల్లోని నల్లమట్టి, ఎర్రమటితో పాటు హాని కలిగించని రంగులతో త్రిముఖ రూపంలో గణనాధుడు దర్శనమిచ్చారు. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. అంతకు ముందు సంప్రదాయ హోమాలు, పూజలు నిర్వహించి విగ్రహాన్ని ప్రతిష్ట చేశారు. శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక దేవస్థానంలో మాదిరిగా పూజా కార్యక్రమాలు, హోమాలు చేశారు. 21 రోజులు పాటు స్వామివారికి పూజలు, హోమాలు నిర్వహించి, అనంతరం నిమజ్జనం చేసేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటి చైర్మన్ నరేంద్రరెడ్డి మాట్లాడుతూ 99 అడుగుల ఎత్తుతో ఈ విగ్రహాన్ని రూపొందించామని, ఉత్సవంలో ప్రజలు పాల్గొని స్వామి వారిని దర్శించుకోవాలని కోరారు.

దర్శనానికి రూ 50....చెప్పులకు రూ 10....

మహా గణపతి దర్శనంకు వచ్చే భక్తుల బలహీనతను నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారు. తొలుత ఉచిత దర్శనం అని చెప్పి తీరా దర్శనంకు ఒక్కోక్కరికి రూ 50, చెప్పులకు రూ 10 ఇతర ఫీజులు అంటూ ధరలు నిర్ణయించి దోపిడికి తెరలేపారు. విగ్రహాన్ని అడ్డుపెట్టుకొని వ్యాపారాలు చేయడంపై భక్తులు, స్థానికులు మండిపడుతున్నారు. దీనికి తోడు విగ్రహం చుట్టూ ధార్మిక, ఆధ్యాత్మిక ప్రసంగాలు, సాంస్కృతిక ప్రదర్శనలు లేకుండా జబర్దస్త్ స్కిట్లు, కమర్షియల్ స్టాల్స్‌ను ఏర్పాటు చేయడంపై అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఈ వివాదంపై కమిటీ ప్రతినిధులు వివరణ ఇచ్చారు. విగ్రహం దర్శనం ఉచితమని, కాని విగ్రహం వద్ద పూజలు చేయించుకునే వారికి రూ.50 వసూలు చేస్తున్నటు సమాధానాన్ని దాట వేస్తున్నారు.



అవతార్ వరల్డ్ పేరుతో సెట్టింగ్

● గుంటూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): శ్రీ పుట్టలమ్మ తల్లి సేవా సంఘం ఆధ్వర్యంలో 21వ గణపతి మహోత్సవాల్లో భాగంగా నల్లపాడు శ్రీ పుట్టలమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో వినూత్నంగా అవతార్ వరల్డ్ సెట్టింగ్‌ను ఏర్పాటు చేశారు. పలకలూరుకు చెందిన చెన్నసేవ డెకరేటర్స్ వారి ఆధ్వర్యంలో నెల రోజులుగా 30 మంది కూలీలతో శ్రమించి 15 అడుగుల మట్టి గణపతి విగ్రహాన్ని ఆకట్టుకునేలా తయారు చేశారు. అవతార్ సెట్టింగ్‌తో ఆకట్టుకునేలా ఏర్పాటు చేయటం భక్తులను ఆకర్షిస్తోంది.

టీచర్ ఉద్యోగం పేరుతో రూ.16 లక్షలకు మోసం

గుంటూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ టీచర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ.16 లక్షలు తీసుకొని మోసం చేసిన ముగ్గురిపై బాధితుడు నల్లమోతు డేవిడ్‌పాల్ ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం నెక్కలం గ్రామానికి చెందిన నల్లమోతు డేవిడ్ పాల్ ప్రైవేట్ టీచర్‌గా పనిచేస్తున్నారు. బాపట్ల జిల్లా రేపల్లె పరిధిలోని గూడవల్లి గ్రామానికి చెందిన ప్రభుత్వ టీచర్ కేసన జ్యోతి తన బంధువైన గుంటూరులోని బ్రాడీపేట చెందిన కేసన అనుజ్ఞసాయి, ఆమె తమ్ముడైన కేసన జానకిరామన్ తదితరులు ముగ్గురు ముఠాగా ఏర్పడి ప్రభుత్వ టీచర్‌గా ఉద్యోగం ఇప్పిస్తామని డేవిడ్‌పాల్‌ను నమ్మించారు. 2024 జూన్ 19 నుంచి పలు దఫాలుగా డేవిడ్‌పాల్ నుంచి రూ.16 లక్షలు తీసుకుని ఉద్యోగం ఇప్పించలేదు. నగదు అడిగితే బెదిరిస్తున్నారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసన అనుజ్ఞ సాయి, జానకిరామన్, కేసన జ్యోతిలపై నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మామపై అల్లుడు దాడి

కుమార్తెను కాపురానికి పంపకపోగా, తనను తప్పుడు కేసులతో వేధిస్తూ ఇబ్బంది పెడుతున్నారని నగరంపాలెం మూడు బొమ్మలు సెంటర్లో బార్బర్ షాప్ నిర్వహిస్తున్న మామ ఒక్కలుగడ్డ శివపై అల్లుడు గోరంట్లకు చెందిన గంగాధర శివనాగరాజు కత్తెరతో దాడి చేశాడు. శివ కుమార్తె సునీతతో నాగరాజుకు సుమారు 20 ఏళ్ల క్రితం వివాహ జరిగింది. వేధిస్తున్నాడని నాగరాజుపై సునీత మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ప్రస్తుతం కేసు కోర్టు విచారణలో ఉంది. ఈ క్రమంలో ఈ నెల 25న అల్లుడు శివ నాగరాజు శివ తలపై కత్తెరతో దాడి చేసి కొట్టాడు. నాగరాజుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు జీజీహెచ్‌లో దివ్యాంగుల సర్టిఫికెట్లు పరిశీలన

గుంటూరు (విద్య) ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన దివ్యాంగుల సర్టిఫికెట్ల పరిశీలన శుక్రవారం జీజీహెచ్‌లో నిర్వహించనున్నట్లు డీఈఓ సీవీ రేణుక ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యార్థులే వికాస రథసారథులు

● ప్రభుత్వ మైనార్టీ వ్యవహారాల సలహాదారు అహమద్ షరీఫ్



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న షరీఫ్, నసీర్

గుంటూరు(తూర్పు), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ప్రతిభను గుర్తించి, ప్రోత్సహించడం ద్వారా రానున్న తరానికి వికాస రథసారథులుగా మారుతారని ప్రభుత్వ మైనార్టీ వ్యవహారాల సలహాదారు మొహమ్మద్ అహమద్ షరీఫ్ అన్నారు. స్థానిక పట్టాభిపురం, అబుల్ కలాం ఆజాద్ కల్యాణ మండపంలో బ్రైట్ హారిజన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డుల కార్యక్ర మంలో తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహమద్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. షరీఫ్ మాట్లాడుతూ విద్యార్థుల ఎంచుకున్న మార్గంలో చేయూతనివ్వడంలో అధ్యాప కులు, సామాజిక సేవా సంస్థలు కీలకపాత్ర పోషించాలని సూచించారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ విద్యార్థుల డ్రాప్ అవుట్ లను తగ్గించేందుకు ప్రత్యేక ప్రచారాలు నిర్వహించాలని ఫౌండేషన్ నిర్వాహకు లకు సూచించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు ఎస్.మొహియిద్దీన్, సభ్యులు చాంద్‌బాషా, ఖలీద్ ఇక్బాల్, అన్సార్ బాబు, జీలాని, బాషా, సలీమ్, డాక్టర్ ఆరిఫా, బాబావలి, సిరాజుద్దీన్, హుస్సేన్ తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముస్లిం జీవితాల్లో వెలుగులు తీసుకొద్దాం : షరీఫ్

గుంటూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మైనారిటీల జీవితాల్లో వెలుగులు తీసుకొచ్చే గొప్ప అవకాశం సీఎం చంద్రబాబు ద్వారా కూటమి ప్రభుత్వ రూపంలో వచ్చిందని, దీనికి అందరం కలిసికట్టుగా పని చేద్దామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్‌తో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మైనారిటీ వ్యవహారాల సలహాదారు ఎంఏ షరీఫ్ అన్నారు. గుంటూరులోని తూర్పు ఎమ్మెల్యే కార్యాలయానికి ఎంఏ షరీఫ్ బుధవారం విచ్చేశారు. ఆయనకు ఎమ్మెల్యే నసీర్ స్వాగతం పలికారు. వినాయక చవితి సందర్భంగా గుంటూరు నగరంలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక చవితి మండపాలను తూర్పు ఎమ్మెల్యే నసీర్ గురువారం దర్శించుకున్నారు. మండపాల్లో వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆకతాయిల ఆటకట్టిస్తాం : ఎమ్మెల్యే మాధవి



ఆకతాయిలను పోలీసులకు అప్పగిస్తున్న ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఆకతాయిల ఆటలు కట్టిస్తామ ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు రెడ్డి కాలేజీ ప్రాంతానికి వెళ్లిన ఎమ్మెల్యేకు ఆకతాయిల వేదింపులపై స్థానిక మహిళలు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆమె వెంటనే కాలేజీ వద్దకు చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. అక్కడే ఉన్న ముగ్గురు ఆకతాయిలను గుర్తించి పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలో గంజాయి వ్యసనం పెరుగుతున్న దృష్ట్యా పెట్రోలింగ్‌ను మరింతగా పెంచాలని, గంజాయి అమ్మకందారులను గుర్తించి కట్టడి చేయాలని, ఇలాంటి సంఘటనలు మళ్లీ చోటు చేసుకోకుండా సమగ్ర పర్యవేక్షణ చేయాలని పోలీసు విభాగానికి ఆదేశాలు జారీ చేశారు.

ప్రజాసేవకు పునరంకితం అవుతా

● జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



వృద్ధులకు పండ్లు, దుస్తులు అందజేస్తున్న కత్తెర హెనీ క్రిస్టినా

గుంటూరు సిటీ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : సమాజంలోని అన్ని వర్గాల వారికి మేలు చేసేందుకు ప్రజాసేవకు పునరంకితం అవుతానని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా అన్నారు. గురువారం జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పుట్టిన రోజు వేడుకలను గుంటూరులోని నిర్మల్ హృదయ్ వృద్ధాశ్రమంలో నిర్వహించారు. అక్కడ ఉన్న అనాధ వృద్ధులకు ఆమె పండ్లు, దుస్తులు అందజేశారు. అనంతరం జిల్లా పరిషత్ కార్యాలయంలో సీఈఓ జ్యోతి బసు, డిప్యూటీ సీఈఓ కృష్ణ ఇతర ముఖ్య అధికారులు, పలువురు జడ్పీటీసీ సభ్యుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. చైర్‌పర్సన్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపేందుకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి అధికారులు జడ్పీకి తరలివచ్చారు. ఆమె జడ్పీ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం మరమ్మతులు నిర్వహించిన పంచాయతీ రాజ్ అతిధి గృహాన్ని ప్రారంభించారు.

కేసుల్లో దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేయాలి

● నేర సమీక్షలో అధికారులను ఆదేశించిన ఎస్పీ సతీష్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ సతీష్ కుమార్


గుంటూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): హత్యలు అత్యాచారాల కేసుల్లో దర్యాప్తును త్వరతగతిన పూర్తిచేసి కోర్టుల్లో చార్జిషీటు దాఖలు చేయాలని ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జూలై నెల నేర సమీక్షలో అధికారులకు ఎస్పీ పలు ఆదేశాలు జారీచేశారు. నేర నియంత్రణ చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. మాదక ద్రవ్యాల నేరాలు, మహిళలపై నేరాలు, శారీరక దాడులకు సంబంధించిన కేసుల్లో పెండింగులో ఉన్న నాన్ బెయిలబుల్ వారెంట్లను తక్షణమే అమలు చేయాలని ఆదేశించారు. తప్పిపోయిన వారి కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేసి, కుటుంబాలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. మోసం, అధికార దుర్వినియోగం వంటి వైట్ కాలర్ నేరాలపై ప్రత్యేక దృష్టి సారించి, చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల కేసుల్లో పదేపదే నేరాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్‌డీపీఎస్ కేసుల్లో పెండింగ్‌లో ఉన్న అరెస్టులను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు జీవీ రమణమూర్తి, రవికుమార్, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా దర్శనం శ్రీనివాస్

గుంటూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నగరానికి చెందిన దర్శనం శ్రీనివాస్ నియమితుడయ్యారు. ఈ మేరకు గురువారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఇంచుమించు 10 ఏళ్లకు పైగా దర్శనం శ్రీనివాస్ బీజేపీలో క్రియాశీలకంగా కొనసాగుతున్నారు.


గణేష్ మహరాజ్‌కీ జై


తెనాలి: రజకపేటలో ఆంజనేయ గణపతి


గుంటూరు: కాకుమానువారితోటలో ఏర్పాటు చేసిన గణనాథుడు


కర్లపాలెం: పాపిరెడ్డిపాలెంలో కొలువుతీరిన వినాయకుడు


గుంటూరు: ఏలూరు బజారులో పుష్పాల అలంకరణలో కొలువు దీరిన గణనాథుడు


పొన్నూరు: కాళింద మర్దన కృష్ణ అలంకారంలో కొలువైన గణనాథుడు


తుళ్లూరులో ప్రత్యేక అలంకరణలో కొలువుదీరిన గణనాథుడు


తాడేపల్లి: ఉండవల్లిలో కొలువైన ఎకో ఫ్రెండ్లీ (మట్టి) గణపతి

విద్యుత్ కాంతులు, సంప్రదాయాలు ఉట్టిపడేలా, సినీ సెట్టింగ్‌లను మరిపించేలా ఏర్పాటు చేసిన మండపాల్లో వినూత్న రూపాల్లో గణనాథులు భక్తులకు దర్శనమిచ్చారు. వినాయక చవితిని పురస్కరించుకుని గుంటూరు, బాపట్ల, నరసరావుపేటలతో పాటు వివిధ పట్టణాలు, పల్లెల్లో భారీ గణపతులు కొలువుతీరగా భక్తులు దర్శనాలకు పోటెత్తారు. గణపతి బప్పామోరియా, జై బోలో గణేష్ మహరాజ్‌కీ జై అన్న నినాదాలతో మండపాలు మారుమోగాయి.

పాతమంగళగిరి జీఆర్ స్కూల్ వద్ద కొలువైన గణనాథుడు


తాడికొండ: నిడుముక్కలలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహం


గుంటూరు నల్లచెరువు, 6వ లైన్లో కొలువుదీరిన గణనాథుడు


నరసరావుపేట: కోటప్పకొండ రోడ్డులో ఏర్పాటుచేసిన మట్టి విగ్రహం


మురుగు ఉండదు.. నీరు కనిపించదు

- నాలుగు గ్రామాల్లో మేజిక్ డ్రెయిన్‌లు
- మురుగునీరు భూమిలో ఇంకిపోయే వ్యవస్థ
- కొలకలూరు బీసీ కాలనీలో పైలట్ ప్రాజెక్టు
- చింతలపూడి, మంగళగిరిపాడు, తిక్కిరెడ్డిపాలెం ప్రతిపాదనల నివేదన

గుంటూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో డ్రెయిన్ల నిర్మాణం, నిర్వహణ పంచాయతీలకు భారంగా మారుతుండటంతో ఉపాధి హామీ పథకం కింద మేజిక్ డ్రెయిన్లను నిర్మించాలని ప్రభుత్వం ఆదేశించింది. తక్కువ ఖర్చు, జీరో మెయిన్‌టెనెన్స్, నీరు ఎక్కడికక్కడ ఇంకిపోయే ప్రయోజనాలు ఉండటంతో తొలుత నాలుగు గ్రామాల్లో అక్టోబరు 2వ తేదీ నాటికి నిర్మించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ఇప్పటికే తెనాలి మండలంలోని కొలకలూరు బీసీ కాలనీలో పైలట్ ప్రాజెక్టుగా 160 మీటర్ల మేజిక్ డ్రెయిన్‌ని నిర్మించారు. దుగ్గిరాల మండలంలోని చింతలపూడి, మేడికొండూరులోని మంగళగిరిపాడు, ప్రత్తిపాడులోని తిక్కిరెడ్డిపాలెంలోనూ మేజిక్ డ్రెయిన్లను ప్రతిపాదనలను పంపించారు. వీటి పనులు కూడా త్వరలోనే ప్రారంభమౌతాయని అధికారవర్గాలు తెలిపాయి.

మేజిక్ డ్రెయిన్‌లు అంటే...

మేజిక్ డ్రెయిన్లను ఇరుకుగా ఉండే రోడ్లలో నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తారు. అర మీటర్ వెడల్పు, రెండు మీటర్ల లోతు ఉపాధి హామీ లేబర్ కాంపొనెంట్ కింద మట్టి పని చేయిస్తారు. ఆ తర్వాత 75 ఎంఎం ఓటీజీ రాయితో లేయర్ వేస్తారు. రెండో లేయర్ 40 ఎంఎం మెటల్, మూడో లేయర్ 20 ఎంఎం మెటల్‌లతో లేయర్ నిర్మిస్తారు. ప్రతీ 30 మీటర్లకు ఒక ఇంకుడు గుంట కూడా ఈ మేజిక్ డ్రెయిన్‌లోనే నిర్మాణం చేస్తారు. అందులోకి వచ్చిన నీరు భూమిలోకి ఇంకిపోయేలా నాలుగు లేయర్ల రాక్, మెటల్‌తో నిర్మిస్తారు. ప్రతీ వీధి చివరన ఒక పెద్దగుంతని కూడా తవ్వుతారు. వీటి వలన ఇళ్లల్లో ఉత్పత్తి అయ్యే నీటితో పాటు వర్షం కురిసిన సమయంలో వచ్చే వరదనీరు కూడా తేలికగా భూమిలోకి ఇంకిపోయి భూగర్భ జల మట్టాన్ని పెంచుతుంది.

నిర్వహణ... పారిశుధ్యం సులభతరం

మేజిక్ డ్రెయిన్ నిర్వహణ పెద్దగా ఉండదు. దీని వలన పారిశుధ్యం గణనీయంగా మెరుగుపడుతుంది. ఏడాదికి ఒకటి/రెండుసార్లు మాత్రం మేజిక్ డ్రెయిన్‌లో ఏర్పడే మట్టి, చెత్త, చెదారాలను తొలగిస్తే సరిపోతుంది. ఈ డ్రెయిన్ల వలన ఇళ్ల మధ్యన మురికికూపాలు ఏర్పడే అవకాశం ఉండదు. దాంతో ప్రజలు అంటువ్యాధుల బారినపడే ప్రమాదం అసలే ఉండదని అధికారవర్గాలు తెలిపాయి. మహాత్మా గాంధీ జయంతి నాటికి జిల్లాకు కేటాయించిన నాలుగు గ్రామాల్లో మేజిక్ డ్రెయిన్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకొన్నారు.


మేజిక్ డ్రెయిన్

డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

- తొలి రోజు 932 మందికి పూర్తి
- 28 కమిటీలతో ప్రత్యేక ఏర్పాట్లు

గుంటూరు (విద్య) ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో టీచర్ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన గురువారం గుంటూరు నగరంలోని ఆంధ్ర క్రిస్టియన్ (ఏసీ కళాశాలలో) ప్రారంభమైంది.


సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరైన అభ్యర్థులు

సర్టిఫికెట్ల పరిశీల కోసం విద్యాశాఖ మొత్తం 28 కమిటీలను ఏర్పాటు చేసింది . ఉదయం 10 గంటలకు ప్రారంభమైన పరిశీలన కార్యక్రమం సాయంత్రం వరకు కొనసాగింది. తొలుత కొన్ని సాంకేతిక కారణాలవల్ల వల్ల పరిశీలన ఆలస్యమైనప్పటికీ మధ్యాహ్నం నుంచి ఊపందుకుంది. మెగా డీఎస్సీలో ఉమ్మడి జిల్లా నుంచి ఎంపికైన మొత్తం 1143 మంది అభ్యర్థులకు గాను తొలిరోజు 932 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల పూర్తి చేసినట్లు డీఈఓ సీవీ రేణుక వెల్లడించారు.మొత్తం 28 కమిటీల్లో ఒక్కో కమిటీకి 50 మంది అభ్యర్థులను కేటాయించి పరిశీలన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించినట్లు వెల్లడించారు. ఇలా ఉంటే సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమానికితి ఆర్జీడీ లింగేశ్వర్ రెడ్డి తో పాటు బాపట్ల డీఈఓ పురుషోత్తం ,పల్నాడు డీఈవో చంద్రకళ తో పాటు ఎంఈఓ లు హాజరయ్యారు.

కేంద్రం బయట అభ్యర్థుల బంధువుల కోలాహలం

మెగా డీఎస్సీ సర్టిఫికెట్ పరిశీలనకు వచ్చిన అభ్యర్థులతో పాటు వారి బంధువులు, కుటుంబ సభ్యులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. దీంతో ఏసి కళాశాలలోని సర్టిఫికెట్ల పరిశీలన కేంద్రం వద్ద కోలాహలం నెలకొంది. కొంతమంది అభ్యర్థులు సర్టిఫికెట్ల పరిశీలన కోసం కేంద్రంలోకి వెళ్తూ పిల్లల్ని కుటుంబ సభ్యులు, బంధువులు వద్ద వదిలి వెళ్లారు. భార్యాభర్తల్లో ఒకరికి, ఉద్యోగం రాగా మరొకరు పిల్లల్ని సముదాయించుకుంటూ కేంద్రం కేంద్రం వద్ద కనిపించారు. భార్యాభర్తలిద్దరికీ ఇద్దరికీ ఉద్యోగాలు వచ్చినవారు పిల్లల్ని కుటుంబ సభ్యులకు అప్పగించి వెళ్ళడం కనిపించింది.


కమిటీ వద్ద సర్టిఫికెట్ల పరిశీలన చేయించుకుంటున్న డీఎస్సీ అభ్యర్థి

దరఖాస్తు చేయకుంటే మీ సంగతి చూస్తాం

- అసోసియేషన్ నేతలతో ఎక్సైజ్ అధికారుల హెచ్చరికలు
- బార్లకు నేటితో ముగియనున్న గడువు.. వ్యాపారులతో చర్చలు

గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): బార్లకు పెద్దఎత్తున దరఖాస్తులు చేయండి.. లేకపోతే మీ సంగతి చూస్తాం అంటూ ఎక్సైజ్ అధికారులు మద్యం అసోసియేషన్ నాయకులను బెదిరించారని సమాచారం. బార్ల లైసెన్సులకు గడువు పొడిగిస్తున్నా దరఖాస్తు చేసేందుకు వ్యాపారులు ముందుకు రావడంలేదు. తాజాగడువు శుక్రవారంతో ముగియనుంది. ఈ నేపథ్యంలో గురువారం గుంటూరులోని ఎక్సైజ్ కార్యాలయంలో మద్యం అసోసియేషన్ నాయకులతో అధికారులు చర్చలు జరిపారు. బార్ల పాలసీ నష్టంచేకూరేలా ఉందంటూ, అందుకే తాము దరఖాస్తు చేయలేకపోతున్నామని అసోసియేషన్ నాయకులు అధికారులకు తెలిపారు. అదేం కుదరదు మీరు విరివిగా బార్లకు దరఖాస్తు చేయకపోతే.. వైన్ షాపులను ఏవిధంగా నిర్వహిస్తారో చూస్తామంటూ అధికారులు హెచ్చరికలు జారీ చేశారని తెలిసింది. అసోసియేషన్ గుమస్తా మణికుమార్‌ను విజయవాడ ఎస్టీఎఫ్ అధికారులు అదుపులోకి తీసుకుని బెదిరించినట్లు తెలిసింది. బార్లకు దరఖాస్తులు చేయకపోతే వైన్ షాపులపై కేసులు పెడతామని హెచ్చరించినట్లు సమాచారం. నిబంధనలను కఠినతరం చేస్తామని తేల్చిచెప్పినట్లు తెలిసింది. అయినా కూడా తాము ఏమీ చేయలేమని.. ప్రస్తుత పాలసీ తీవ్రంగా నష్టాలు వచ్చేటట్లుగా ఉందని.. బార్లకు దరఖాస్తు చేయలేమని అసోసియేషన్ నాయకులు అధికారుల ఎదుట స్పష్టం చేసినట్లు తెలిసింది. ఈ పరిస్థితుల్లో బార్లకు దరఖాస్తు చేసేందుకు వ్యాపారులు ముందుకు రాకపోతే ఏమి చేయాలంటూ అధికారులు తల పట్టుకుంటున్నారు.

తెలుగు వెలుగు మసకబారుతుందా..?!

- తెలుగు భాషాభిమానులు ఆందోళన
- భాషాభివృద్ధికి ప్రభుత్వాలు పూనుకోవాలి
- నేడు తెలుగు భాషా దినోత్సవం

నరసరావుపేట కల్చరల్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): దేశభాషలందు తెలుగు లెస్స. అని విజయనగర చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు తెలుగుభాష ఔన్నత్యాన్ని కీర్తించారు. మహోజ్వలమైన సాహిత్యంతో తెలుగుభాష విశ్వఖ్యాతిని పొందింది. పద్యంతో ఏ భాషకు లేని విశిష్టత తెలుగుభాష సొంతం చేసుకుంది.. అవధాన ప్రక్రియ తెలుగుభాషకే సొంతం.. వేల ఏండ్ల ఘన చరిత్రగల తెలుగుభాష వెలుగులు ఇంగ్లీషు ధాటికి, ఇంటర్నెట్ తాకిడికి మసకబారుతుందా? అంటే భాషావేత్తలు అవుననే చెబుతున్నారు. గత ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో తెలుగు మీడియం ఎత్తివేయడం భాష మనుగడకు గొడ్డలి పెట్టని భాషాభిమానులు చెప్తున్నారు. కూటమి ప్రభుత్వం పాఠశాలలో తెలుగు మీడియంను పునరుద్ధరిస్తుందని అనుకున్న భాషవేత్తల ఆశలు అడియాశలయ్యాయి. ప్రభుత్వాలు పూనుకుని తెలుగు భాషాభివృద్ధికి చర్యలు తీసుకోకపోతే భాష మనుగడ ప్రశ్నార్థకం అవుతుందంటున్నారు.

ప్రభుత్వాలు పూనుకోవాలి



● డాక్టర్ పోలేపెద్ది రాధాకృష్ణమూర్తి

ఏ భాష అయినా ప్రచారంలో ఉండాలంటే, సజీవ భాషగా నిలవాలంటే మొదటగా దానిని ఆదరించాల్సింది ప్రభుత్వమే. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ దిశగా ఆలోచన చేసి తెలుగు భాషాభివృద్ధికి కృషి చేస్తుందన్న నమ్మకం ఉంది.

తెలుగుభాష అభ్యున్నతికి మాన్‌సింగ్ నాయక్ కృషి



కారంపూడి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): తెలుగు భాష అభ్యున్నతికి మాన్‌సింగ్‌నాయక్ విశేషంగా కృషి చేస్తున్నారు. బొల్లాపల్లి మండలం హనుమాపురంనకు చెందిన బాణావత్ మాన్‌సింగ్‌నాయక్ కారంపూడిలో ఎంపీపీ పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తెలుగుభాషను బతికించాలనే లక్ష్యంతో గేయాలు, కథలు చిన్నచిన్న పుస్తకాలు ప్రచురించి విద్యార్థులకు అందిస్తున్నారు. సుమారు 2వేల పుస్తకాలను సేకరించి పాఠశాలలో గ్రంథాలయం కూడా ఏర్పాటుచేశారు. మాన్‌సింగ్ నాయక్ సేవలను గుర్తించిన ఆంధ్రప్రదేశ్ సర్వశిక్ష అభియాన్ 2021లో చదవడం మాకిష్టం అనే పథకం కింద జిల్లా కోఆర్డినేటర్‌గా ఎంపిక చేశారు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీకి ఉమ్మడి గుంటూరు జిల్లా ఎక్స్‌పర్ట్ టీచర్‌గా ఎంపిక చేశారు.

హద్దులు దాటిన యూరియా దందా

(5వ పేజీ తరువాయి)

ఎక్కువగా యూరియా నిల్వలు తెలంగాణకు వెళ్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. సరిహద్దు ప్రాంతాల నుంచి వందల టన్నుల యూరియా తెలంగాణకు తరలి వెళ్తుంది. రూ.266.50 యూరియా బస్తాను వ్యాపారులు బోగస్ రైతుల పేర్లతో దళారులకు విక్రయిస్తున్నారు. వారు అదే యూరియాను తెలంగాణకు తీసుకువెళ్లి రూ.850కి విక్రయిస్తున్నారు. ఫలితంగా సకాలంలో ఎరువులు దొరక్క రైతులు అల్లాడి పోతున్నారు. రెండు నెలలుగా పల్నాడు జిల్లా కారంపూడి అడ్డాగా గుట్టుగా సాగుతున్న ఎరువుల దందాను విజిలెన్స్ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం కాంతనపల్లికి చెందిన సభినాల సురేష్ రెండు నెలలుగా యూరియాను పక్కదారి పట్టిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. కారంపూడికి చెందిన నంద్యాల నాగరాజును మధ్యవర్తిగా నియమించుకుని సురేష్ ఎరువులు కొనుగోలు చేస్తున్నారు. కారంపూడికి చెందిన నీరజ లక్ష్మీవెంకట సత్యనారాయణ కమర్షియల్ కార్పొరేషన్ యజమాని ఆతుకూరి నరసింహారావు వీరికి సహకరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కారంపూడి, మాచర్ల ప్రాంతాలకు చెందిన రైతుల పేర్లతో బిల్లులు రాసి విక్రయాలు జరుపుతున్నట్లు తెలుస్తుంది. దాచేపల్లి మండలంలోని పొందుగుల చెక్‌పోస్టు వద్ద బుధవారం అర్ధరాత్రి సురేష్, బొలగనా సుధీర్ అనే వ్యక్తులు రెండు వాహనాల్లో తరలిస్తున్న 165 బస్తాల యూరియాను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

తెనాలి రైల్వే స్టేషన్‌కు విద్యుత్ కాంతులు

● ప్రయాణికులను ఆకట్టుకుంటున్న విద్యుత్ కాంతులు

తెనాలి అర్బన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): తెనాలి రైల్వే స్టేషన్ ముఖ ద్వారం విద్యుత్ కాంతుల సోయగం ప్రయాణికులను ఆకట్టుకుంటోంది. ప్రైవేటు భవనం కాదు ఇది తెనాలి రైల్వే స్టేషన్ అంటూ ప్రయాణికులు మురిసి పోతున్నారు. స్టేషన్ అభివృద్ధిలో భాగంగా ఏర్పాటు చేసిన అన్ని రంగుల లైట్లు ప్రత్యేక అందాన్ని తెచ్చిపెట్టాయి. ముఖ్యమైన రోజుల్లో మాత్రమే ఈ లైట్లను వెలిగిస్తున్నారు. వినాయక చవితి పర్వదినాన రైల్వే స్టేషన్ ఇలా వెలిగిపోతుంది. మరో పక్క కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అమృత్ భారత్ పథకంలో రూ27 కోట్లతో చేస్తున్న పనులు పూర్తయితే తెనాలి రైల్వేస్టేషన్ రాష్ట్రంలోనే ఓ మోడల్‌గా సౌకర్యాలతో ప్రయాణికులను అలరించనుంది.




యూరియా కోసం బారులు

(5వ పేజీ తరువాయి)

యూరియా నిల్వలు ఇప్పటికే సరఫరా చేశాం.. కావాలంటే గణాంకాలే రుజువని వ్యవసాయశాఖ చెబుతోంది. కానీ క్షేత్రస్థాయి పరిస్థితులు మాత్రం భిన్నంగా కనిపిస్తున్నాయి. ఖరీఫ్ అవసరాల్లో ఇప్పటికే దాదాపు 60శాతం యూరియా కేటాయించినట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు. కానీ రైతులకు మాత్రం వెతలు తప్పడం లేదు. పంపిణీలో అధికశాతం రాజకీయ సిఫారసులే ప్రామాణికంగా పక్కదారి పడుతుండగా ఇదే అవకాశంగా వ్యాపారులు యూరియాను బ్లాక్‌చేసి సమస్యను తీవ్రం చేస్తున్నారనే విమర్శలున్నాయి. యూరియా కోసం రైతులు ఇబ్బందిపడకూడదని, ఎరువుల అక్రమాలపై విజిలెన్స్ దాడులు ముమ్మరం చేయాలని తాజాగా సీఎం చంద్రబాబు ఆదేశించారు. అయినా వ్యాపారులు యూరియాను బ్లాక్ చేసి విక్రయిస్తున్నారు. 45 కిలోల యూరియా బస్తాను రూ.266లకు అమ్మాల్సి ఉండగా రూ.400 వరకు అమ్ముతూ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. కాదంటే నానో యూరియా, కాంప్లెక్స్ ఎరువులు తీసుకున్న వారికే యూరియా అని మెలిక పెడుతున్నట్లు తెలుస్తోంది.

మునక కారణమెలా...

ఇటీవల కురిసిన వర్షాల ధాటికి అనేక ప్రాంతాల్లో వరి ముంపు బారిన పడింది. దీంతో పైరు కాపాడుకోవడానికి రైతులు రెండోసారి యూరియా వాడాల్సి వచ్చింది. కుళ్లిపోయే దశలో ఉన్న పైరును కాపాడుకోవడానికి రైతులు ఎకరాకి బస్తా యూరియా చల్లాల్సి వచ్చింది. యూరియా ఇక్కట్లకు ఇది కూడా ఒక కారణమని అధికారులు చెప్తున్నారు. అయితే రెండోసారి యూరియా రైతులు వేస్తున్నా కేటాయించిన నిల్వల లెక్కల ప్రకారం సమృద్ధిగానే ఉండాలి తప్ప కొరత ఎందుకొచ్చిందనే దానికి అధికారులే సమాధానం చెప్పాలి.

పరపతి ఉన్నవారికే..

పీఏసీఎస్‌లు, ఆర్‌ఎస్‌కేల్లో రాజకీయ సిఫారసులే ప్రామాణికంగా యూరియా అందిస్తున్నారనే విమర్శలున్నాయి. నిబంధనల ప్రకారం రైతులకు పంపిణీ జరగాల్సి ఉండగా, పరపతి గల రైతులకు పెద్దమొత్తంలో యూరియా కేటాయిస్తున్నారు. పలుకుబడి ఉన్న వారు అవసరం లేకపోయినా 20 నుంచి 30 బస్తాలు నాయకుల సిఫార్సుతో తీసుకుంటున్నారు. దీని వల్ల తమ దాకా వచ్చేసరికి కొరత ఏర్పడుతుందని చిన్న, సన్న కారు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పీఏసీఎస్‌లకు నిల్వల కేటాయింపులతోనే అధికారులు సరిపెడుతున్నారు తప్పితే వాటిని రైతులకు చేర్చేవరకు పర్యవేక్షణ లేకుండా పోతుందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని చోట్ల అయితే ఏకంగా స్థానికంగా ఉన్న నేతలే యూరియా పంపిణీ బాధ్యతలు తీసుకుని తమకు తోచిన విధంగా ఇస్తున్నారు.

అమరావతి రైతులకు నేడు ప్లాట్ల ఈ-లాటరీ

తుళ్లూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా రాజధాని అమరావతి నిర్మాణానికి సీఆర్‌డీఏ పరిధిలో భూ సమీకరణ పథకంలో భూములను సీఆర్‌డీఏకి అప్పగించిన పెనుమాక జరీబు రైతులకు ప్లాట్లు కేటాయించేందుకు ఆగస్టు 29 (శుక్రవారం) సాయంత్రం 4గంటల నుంచి విజయవాడ లెనిన్ సెంటర్‌లోని సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో ఈ-లాటరీ జరుగుతుందని కమిషనర్ కార్యాలయం అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ-లాటరీలో భాగంగా 52 మంది రైతులకు 84 ప్లాట్లను ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టమ్ ద్వారా కేటాయిస్తారన్నారు. వీటిలో 51 రెసిడెన్షియల్ ప్లాట్లు, 33 కమర్షియల్ ప్లాట్లు ఉన్నాయి. రైతులు ఈ-లాటరీకి హాజరుకావాలని సీఆర్‌డీఏ అధికారులు ఆ ప్రకటనలో కోరారు.

రైల్వే గేటు మూసివేత

ఫిరంగిపురం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఫిరంగిపురంలోని అల్లంవారిపాలెం వద్ద రైల్వే గేటు మరమ్మతుల నిమిత్తం ఈ నెల 29, 30, 31 తేదీల్లో మూసి వేస్తున్నామని రైల్వే సెక్షన్ ఇంజనీరు ఉమామహేశ్వరరావు గురువారం తెలిపారు. వాహనదారులు, పాదాచారులు, రైల్వే సిబ్బందికి సహకరించి ఆరోగ్యనగర్ అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నుంచి రాకపోకలు కొనసాగించాలని ఆయన కోరారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

మంగళగిరి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలోని ఎర్రబాలెంలో పట్టపగలే చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని నేరి వారి వీధికి చెందిన ఫణి శ్రీరామ్ చిట్స్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. వినాయక చవితి పండుగ సందర్భంగా బుధవారం ఇంటికి తాళం వేసి తన భార్యతో కలిసి కారులో విజయవాడలోని తన తల్లిదండ్రుల ఇంటికి వెళ్లారు. అదే రోజు రాత్రి తిరిగి రాగా, ఇంటి తలుపు తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంటి ఆవరణలో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం మాయమైంది. ఇంట్లోని దేవుడి గదిలో రెండు వెండి దీపపు కుందులతోపాటు హ్యాండ్ బ్యాగులోని రూ.15 వేల నగదు చోరీకి గురైంది. చోరీపై బాధితుడు ఫణి మంగళగిరి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

మంగళగిరిసిటీ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఉద్యమించాలని వామపక్ష నాయకులు పిలుపునిచ్చారు. సీపీఐ, సీపీఎం, సీపీఐ (ఎంఎల్) ఆధ్వర్యంలో గురువారం మంగళగిరి అంబేడ్కర్ సెంటరులో విద్యుత్ అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల నేతలు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి వీసం జవహర్‌లాల్, సీపీఐ పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్‌రావు, నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య పాల్గొన్నారు.

విద్యుత్ అమరవీరులకు నివాళి

పెదనందిపాడు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో విద్యుత్ అమరవీరుల నివాళి, ప్రతిజ్ఞ దిన నిర్వహణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. వారిచిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

శ్రీఅభయాంజనేయ స్వామి వార్షికోత్సవం

దుగ్గిరాల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాలలోని శ్రీఅభయాంజనేయ స్వామి వారి ఆలయ తొలి వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. తెనాలి-విజయవాడ మెయిన్‌రోడ్డులో పాతలాకు సమీపంలో ఉన్న ఆంజనేయస్వామివారి ఆలయం వద్ద రామాచార్యుల పర్యవేక్షణలో శాంతి హోమం నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ప్రిన్సిపాల్ వీరరాఘవయ్యకు అవార్డు

పెదనందిపాడు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక పీఏఎస్ కళాశాల ప్రిన్సిపాల్ జీ వీరరాఘవయ్య డిస్టింగ్విష్డ్ ఎకడమీషియన్ అవార్డుకు ఎంపికయ్యారు. తమిళనాడుకు చెందిన సైంటిఫిక్ లారెల్స్ ఈ అవార్డును అందించనుంది. డాక్టర్ వీరరాఘవయ్య కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌లో ప్రతిభ కనబర్చడంతో ఈ అవార్డును సెప్టెంబరు 5న అందుకోనున్నారు. అవార్డుకు ఎంపిక కావడం పట్ల కళాశాల అధ్యక్షుడు కాళహస్తి సత్యనారాయణ (విశ్రాంత ఏఎస్పీ), సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ లావు రత్తయ్య, కోశాధికారి లావు ఆదిశేషయ్య, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

మంగళగిరిలో.. లోకేశ్ క్యాంపు కార్యాలయం

• ఆర్‌అండ్‌బీ భవనం ఎంపిక

మంగళగిరి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రంలో మంత్రి నారా లోకేశ్ క్యాంపు కార్యాలయం త్వరలో ఏర్పాటుకానుంది. నియోజకవర్గ ప్రజలకు మరింత చేరువలో ఉండాలన్న లక్ష్యంతో లోకేశ్ ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్టు టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. దీనికోసం ఇంచుమించు నిర్మాణపనులను పూర్తి చేసుకున్న రహదారులు, భవనాల శాఖ అతిథిగృహ భవనాన్ని ఎంపిక చేసుకున్నట్టు తెలిసింది. గత 2014లో వచ్చిన కృష్ణా పుష్కరాల సందర్భంగా నగరంలో ఉన్న వందల ఏళ్లనాటి ఆర్ అండ్‌బీ అతిథిగృహాన్ని తొలగించి దాని స్థానంలో రూ.1.25 కోట్ల వ్యయంతో కొత్త భవన నిర్మాణాన్ని చేపట్టారు. వివిధ కారణాల నేపథ్యంలో భవన నిర్మాణపనుల్లో విపరీతమైన జాప్యం ఏర్పడింది. ఎట్టకేలకు భవన నిర్మాణపనులు పూర్తయినా.. ఇంటీరియర్, గార్డెనింగ్ వంటి పనులు మిగిలిపోయాయి. ప్రస్తుత సందర్భంలో నియోజకవర్గ ప్రజలకు మరింత చేరువగా ఉండాలన్న లోకేశ్ నిర్ణయంతో...పార్టీ శ్రేణులు అనువైన భవనం కోసం అన్వేషిస్తూ ఉండగా వారి దృష్టిలో ఈ ఆర్‌అండ్‌బీ భవనం పడింది. దీంతో లోకేశ్ ఆదేశాలతో ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులు ఈ భవనాన్ని వినియోగంలోకి తెచ్చే పనిలో పడ్డారు. ఇంటీరియర్ ఇతరత్రా పనులను వెంటనే చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నారు.


మంగళగిరిలో రహదారులు, భవనాల శాఖ వారి అతిథిగృహం

మంగళగిరి-పెదవడ్లపూడి రోడ్డుకు మరమ్మతులు

కూటమి ప్రభుత్వం వచ్చాక మంగళగిరి-తెనాలి రోడ్డుమార్గం బాగుపడింది. ఈ మార్గంలో రేవేంద్రపాడు నుంచి తెనాలి వరకు రోడ్డుపై గుంతలను పూడ్చి కొత్త తారు లేయర్ వేయడంతో ఈ మార్గంలో ప్రయాణకష్టాలు తీరాయని పలువురు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. అయితే రెండుమూడు నెలలుగా కురుస్తున్న వర్షాలకు మంగళగిరి-పెదవడ్లపూడి రోడ్డుమార్గం బాగా దెబ్బతినిపోయింది. దీంతో నియోజకవర్గంలో ఆర్‌అండ్‌బీ రోడ్ల తాత్కాలిక మరమ్మతుల కోసం లోకేశ్ రూ.10లక్షలను మంజూరు చేయించారు. ఈ మొత్తం నుంచి రూ.3 లక్షలను వెచ్చించి పెదవడ్లపూడి మార్గంలో గుంతలను పూడ్చనున్నామని ఆర్‌అండ్‌బీ అధికారులు తెలిపారు.

తుళ్లూరు సొసైటీ అధ్యక్షుడిగా ఇందుర్తి ప్రమాణం

తుళ్లూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : తుళ్లూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడిగా ఇందుర్తి నరసింహారావును గురువారం తుళ్లూరులోని రాయపూడి ఎత్తిపోతల పథకం కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. సొసైటీ డైరెక్టర్లుగా జమ్ముల అనిల్‌కుమార్, పాటిబండ్ల జయకృష్ణలకు నియామక పత్రాలను సెక్రటరీ అందజేశారు. సొసైటీని బలోపేతం చేయడానికి కృషి చేస్తామని అధ్యక్షుడు నరసింహారావు, డైరెక్టర్లు ఈ సందర్భంగా పేర్కొన్నారు. తమ నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్‌కి, స్థానిక టీడీపీ నాయకులు కార్యకర్తలకు వారు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దామినేని శ్రీనివాసరావు, గ్రామ అధ్యక్షుడు కాటా అప్పారావు నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఎంపికైన సొసైటి అధ్యక్షుడు, డైరెక్టర్లకు శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు.


సెక్రటరీ నుంచి నియామక పత్రం అందుకుంటున్న అధ్యక్షుడు ఇందుర్తి నరసింహారావు, డైరెక్టర్లు

నూతన ఆవిష్కరణలకు హ్యాక్‌థాన్ దోహదం

• మలినేని విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ పెరుమాళ్ళు

వట్టిచెరుకూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నూతన ఆవిష్కరణలు, పరిశోధనాత్మక ఆలోచనలు, భవిష్యత్ సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించే లక్ష్యంగా ఈ హ్యాక్‌థాన్ నిర్వహించినట్టు మలినేని విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ పెరుమాళ్ళు అన్నారు. మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం రాష్ట్ర ప్రభుత్వం అమరావతి క్వాంటమ్ వ్యాలీ ప్రోగ్రాంకు మద్దతుగా క్వాంటమ్ కంప్యూటింగ్‌పై ఇంటర్నేషనల్ హాక్‌థాన్‌ను విజయవంతంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పెరుమాళ్ళు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని అత్యంత ఆధునాతన సాంకేతికతపై కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని చెప్పారు. ఇందులో మలినేని విద్యార్థులు పాల్గొని కళాశాలకు మంచి పేరుతో పాటు కేరియర్‌కు బంగారు బాటలు వేసుకోవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో మొత్తం 25 జట్లు పాల్గొనగా జ్యూరీ సభ్యులు మొత్తం ప్రాజెక్టులను పరిశీలించి ఐదు జట్లను విజేతలుగా ప్రకటించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వరరావు, కళాశాల డీన్ డాక్టర్ పీ రమేష్‌బాబు, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ జీ రామస్వామి, ఇతర విభాగాధిపతులు, విద్యార్థినులు పాల్గొన్నారు.


సదస్సులో ప్రసంగిస్తున్న మలినేని విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ పెరుమాళ్ళు తదితరులు

అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్ పోటీల కోసం
ఆర్వీఆర్, జేసీ విద్యార్థులకు శిక్షణ

గుంటూరు(విద్య) ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): 'అమరావతి క్వాంటమ్ వ్యాలీ' నిర్మాణానికి విద్యార్థులు అద్భుత సాంకేతిక ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని ప్రముఖ సాంకేతిక నిపుణులు ప్రొఫెసర్ కే శ్రీనివాస్ పేర్కొన్నారు. క్వాంటమ్ టెక్నాలజీలకు ప్రపంచ కేంద్రంగా అమరావతిని మార్చాలనే లక్ష్యంతో ఏపీ ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న 'అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్' పోటీలకు ఆర్వీఆర్, జేసీ విద్యార్థులను సిద్ధం చేయడానికి, కళాశాలలో గురువారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. క్వాంటమ్ కంప్యూటింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, బ్లాక్‌చెయిన్ వంటి సాంకేతిక విభాగాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో సృజనాత్మక పరిష్కారాలను చూపడంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కొల్లా శ్రీనివాస్ డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ ఎన్వీ శ్రీనివాసరావు, కే రవీంద్ర పాల్గొన్నారు.


శిక్షణ హాజరైన విద్యార్థులు

అమరుల త్యాగం వృథా కాదు : సీపీఎం

తాడేపల్లి (ఉండవల్లి), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఉండవల్లి సుందరయ్య చౌక్‌లో గురువారం బషీర్ బాగ్ విద్యుత్ పోరాటంలో అమరులైన రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామిల 25వ వర్ధంతిని పురస్కరించుకుని విద్యుత్ పోరాట అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో భాగంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం భాస్కరయ్య రాజధాని డివిజన్ కమిటి కార్యదర్శి ఎం రవి మాట్లాడుతూ నాడు విద్యుత్ ఉద్యమాన్ని కర్కశంగా అణచివేసిన చంద్రబాబు ప్రభుత్వానికి ప్రజలు బుద్ధిచెప్పి పదేళ్లపాటు అధికారంలోకి రాకుండా చూశారన్నారు. మళ్లీ నేడు స్మార్ట్ మీటర్లు పెట్టి విద్యుత్ భారాలను ప్రజలపై మోపుతుందన్నారు.

రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక బోర్డు చైర్మన్‌గా వలవల

తాడేపల్లి (కుంచనపల్లి), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక బోర్డు చైర్మన్‌గా వలవల మల్లికార్జునరావు (బాబ్జి) గురువారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి అనంతరం ప్రమాణస్వీకారం చేశారు. తాడేపల్లి మండల పరిధిలోని కుంచనపల్లి శ్రీ శ్రీనివాసా కన్వెన్షన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు అధికారులు పెద్దసంఖ్యలో, నాయకులు, కార్యకర్తలు, కూటమి నేతలు పాల్గొన్నారు.

నేడు అమరావతిలో జాబ్‌మేళా

తుళ్లూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో సీఆర్‌డీఏ మద్దతుతో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి తుళ్లూరులోని నాక్-సీఆర్‌డీఏ స్కిల్ హబ్ సెంటర్‌లో 'జాబ్ మేళా' నిర్వహిస్తున్నట్టు సీఆర్‌డీఏ అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు అమరావతి, చుట్టుపక్కల ఉపాధి అవకాశాలు కల్పించబడతాయన్నారు. సెన్స్ సెమీకండక్టర్ అండ్ ఐటీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, బీఎస్‌ఆర్ ఇన్ఫ్రాటెక్ ఇండియా లిమిటెడ్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్సు కో-లిమిటెడ్, భవ్య హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, సంతోష్ ఆటోమోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ వంటి ప్రముఖ కంపెనీలు ఈ మేళాలో పాల్గొంటాయి. ఎస్ఎస్‌సీ, ఇంటర్, బీటెక్, ఎంఎల్‌టీ, బీఎస్సీ నర్సింగ్, ఏదైనా గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీలతో సహా అర్హత కలిగిన ఫ్రెషర్లు, అనుభవజ్ఞులైన అభ్యర్థులు హాజరు కావడానికి అర్హులు. వివరాలకు సీఆర్‌డీఏ ఫెసిలిటేటర్‌ను లేదా శంకర్- 9848424207, శ్రీకర్- 9963425999లను సంప్రదించవచ్చన్నారు. పాల్గొనే వారు ఫెయిర్‌కు హాజరయ్యే ముందు నైపుణ్యం పోర్టల్ హెచ్‌టీటీపీఎస్://నైపుణ్యం.ఏపీ.జీఓవీ.ఇన్/ ద్వారా కూడా నమోదు చేసుకోవాలన్నారు.

ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్‌కు నీటి విడుదల

తాడేపల్లి (కుంచనపల్లి), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మంత్రి లోకేశ్ చొరవతో ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్ నుంచి సాగునీటి విడుదల ప్రక్రియకు గురువారం శ్రీకారం జరిగింది. లోకేశ్ సొంత నిధులతో ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్‌లోని మోటార్లకు మరమ్మతులు చేయించడంతో దాదాపు 3700 ఎకరాలకు ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్ కింద సాగునీరు అందుతోంది. కూటమి నేతలు గురువారం ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్ మోటార్లకు మంత్రి ఆదేశాలతో స్విచ్చాన్ చేసి పొలాలకు సాగునీరు అందించే ప్రక్రియను ప్రారంభించారు.

పోలీసుల అదుపులో సెల్‌ఫోన్ల దొంగలు

మంగళగిరి సిటీ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రేస్ బైకులపై వచ్చి సెల్‌ఫోన్లు లాక్కుని పరారయ్యే ఇద్దరిని మంగళగిరి రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఐ చిరుమామిళ్ల వెంకట్ తెలిపిన వివరాల ప్రకారం... మంగళగిరి గండాలయపేటకు చెందిన గుదే మహేష్, తాడేపల్లి ప్రాంతానికి చెందిన మరో బాలుడితో కలిసి సెల్‌ఫోన్ దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో మంగళగిరి ఇందిరానగర్‌కు చెందిన మునుస్వామి ఈ నెల 25వ తేదీన గుంటూరు నుంచి ఆటోలో మంగళగిరి వస్తుండగా, ఇద్దరు వ్యక్తులు బైకుపై వేగంగా వచ్చి జేబులోని సెల్‌ఫోను లాక్కుని పరారయ్యారు. ఇదే తరహాలో మరో రెండో చోట్ల చోరీలకు పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు బుధవారం సాయంత్రం నిందితులిద్దరినీ అదుపులోకి తీసుకుని, వారి నుంచి ఐదు సెల్‌ఫోన్లు, యమహా కేటీఎం బైకును స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ వెంకట్ తెలిపారు.

పీఏసీఎస్ చైర్మన్‌గా అంజయ్య బాధ్యతల స్వీకరణ

మంగళగిరి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం ఎర్రబాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన చైర్మన్‌గా బత్తినేని అంజయ్య బాధ్యతలు చేపట్టారు. ఆయనతోపాటు డైరెక్టరుగా కృష్ణాయపాలెం గ్రామానికి చెందిన ఆవల శ్రీనివాసరావు డైరెక్టరుగా ప్రమాణస్వీకారం చేశారు. రైతుల సంక్షేమానికి, సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తామని వారు తెలిపారు.

ఈవీఎంల గోడౌన్‌ను పరిశీలించిన ఆర్డీవో

ఫిరంగిపురం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేపూడిలో గల మార్కెట్ యార్డులోని ఈవీఎంలు, వీవీ ప్యాట్ల గోడౌన్‌ను గుంటూరు రెవెన్యూ డివిజనల్ అధికారి కే శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. నెల వారి తనిఖీల్లో భాగంగా గోడౌన్ భద్రతా ప్రమాణాలను ఆయన తనిఖీ చేసి రిజిస్టర్‌ను పరిశీలించారు.

స్కేటర్ జెస్సీరాజ్‌కు రూ.5 లక్షల ప్రోత్సాహకం

• శాప్ ద్వారా మంజూరు చేసిన ప్రభుత్వం

మంగళగిరి సిటీ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మంగళగిరికి చెందిన అంతర్జాతీయ స్కేటర్, రాష్ట్రపతి బాల పురస్కార్ అవార్డు గ్రహీత మాత్రపు జెస్సీరాజ్‌కు ఏపీ ప్రభుత్వం ఆర్థిక ప్రోత్సాహకం అందించింది. ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ద్వారా రూ.5,02,000లను మంజూరు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా జెస్సీరాజ్ తండ్రి మాత్రపు సురేష్ మాట్లాడుతూ 2024 జూలైలో న్యూజిలాండ్‌లో జరిగిన వరల్డ్ స్కేట్ ఓషియానియా చాంపియన్‌షిప్‌లో జెస్సీరాజ్ భారత జట్టు తరపున ప్రాతినిథ్యం వహించి స్వర్ణ పతకం సాధించిందుకు గుర్తింపుగా ప్రభుత్వం ఈ ప్రోత్సాహకం అందించినట్టు చెప్పారు. జెస్సీరాజ్ క్రీడల్లో మరింతగా రాణించేందుకు ఆర్థిక సహకారం అందించడంపై సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, క్రీడల శాఖా మంత్రి రాంప్రసాద్ రెడ్డి, శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రభుత్వం అందించిన ప్రోత్సాహం జెస్సీరాజ్ క్రీడా ప్రస్థానానికి మరింత ప్రేరణ కలిగిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

పీఏసీఎస్ చైర్మన్ పిచ్చిరెడ్డికి ఘనసన్మానం


పీఏసీఎస్ చైర్మన్ పిచ్చిరెడ్డిని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

మంగళగిరి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన గాదె పిచ్చిరెడ్డిని నంబూరు శ్రీ పోలయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు గురువాకం కలిసి అభినందనలు తెలియజేశారు. సంఘం అధ్యక్షుడు ఈమని ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో పిచ్చిరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ నంబూరు నాగేశ్వరరావు, అన్నపురెడ్డి బ్రహ్మారెడ్డి, తులాబందుల తాతయ్య, వల్లభాపురపు రాజ్‌కుమార్, ఆర్థల శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు వేములూరిపాడు విద్యార్థులు

ఫిరంగిపురం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ఈ నెల 26న నిర్వహించిన జిల్లాస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో వేములూరిపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి తొమ్మిది మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొన్న నలుగురు విద్యార్థులు, ముగ్గురు విద్యార్థినులకు టీమ్‌గేమ్‌లో గోల్డ్‌మెడల్స్ వచ్చాయని గురువారం హెచ్‌ఎం సాంబయ్య తెలిపారు. వ్యక్తిగత ఈవెంట్‌ల్లో 9వ తరగతి చదువుతున్న షేక్ సమీనా, షేక్ అబ్దుల్ ఘనీ మెడల్స్ సాధించారని తెలిపారు. ఈ నెల 30, 31 తేదీల్లో భీమవరంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఈ ఇద్దరు ఎంపికయ్యారని ఆయన తెలిపారు.


పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం సాంబయ్య, పీడీ సుజాతలు

విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ అధికారుల సోదాలు

కాకుమాను, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ గుంటూరు రీజనల్ అధికారి సూర్య శ్రావణ్‌కుమార్ తన సిబ్బందితో గురువారం రాత్రి సోదాలు నిర్వహించారు. యూరియా అక్రమంగా నిల్వ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కాకుమానులోని సాయి ట్రేడర్స్, లక్ష్మీ ప్రసాద్ తదితర షాపుల నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు.

యూరియాను పక్కదారి పట్టిస్తే చర్యలు : ఏవో

కాకుమాను. ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి) : యూరియాను పక్కదారి పంట్టించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఏవో సుధాకర్ హెచ్చరించారు. మండల పరిధిలోని వల్లూరు, లింగంగుంటపాలెం గ్రామాలలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ క్షేత్రాలను సందర్శించిన అనంతరం ఏవో సుధాకర్ మాట్లాడుతూ రైతాంగానికి ఖరీఫ్ సీజన్‌కు సరిపడ యూరియా ఉందని తెలిపారు.

ఎమ్మార్పీ ధరలకే ఎరువులు విక్రయించాలి : ఏవో

పెదనందిపాడు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మార్పీ ధరలకే ఎరువులు విక్రయాలు జరపాలని ఏవో ఐ సుబ్రహ్మణ్యం అన్నారు. మండల పరిధిలోని ఏబీ పాలెం, పెదనందిపాడు, పాలపర్రు గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈపోస్ యంత్రాలు, గోడౌన్ నిల్వలను పరిశీలించారు. డీలర్లు తప్పనిసరిగా అమ్మకాలు జరిపిన వెంటనే ఈపాస్ మిషన్‌లో నమోదు చేయాలని తెలిపారు.

రూ.277.25 లక్షలతో అభివృద్ధి పనులకు తీర్మానం

దుగ్గిరాల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల యార్డులో రూ.277.25 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులపై పాలకవర్గం చేసిన తీర్మానానికి గురువారం యార్డుచైర్మన్ ఛాంబర్‌లో జరిగిన సమావేశం ఆమోదం తెలిపింది. కొన్నేళ్లుగా మర్మతులకు నోచుకోని గోదాములు, బిన్‌గోదాం, వేలం ప్లాట్‌ఫారంలు, బిడ్డింగ్ ప్లాట్‌ఫారంల మరమ్మతులు చేపట్టాలని తీర్మానించారు. అదేవిధంగా కొత్త యార్డు ఆవరణలో రూ.187లక్షలతో సీసీరోడ్డు నిర్మాణం తదితర పనులకు కమిటీ చేసిన ప్రతిపాదనలను ఆమోదిస్తూ సమావేశం తీర్మానం చేసింది. చైర్‌పర్సన్ ఉన్నం ఝాన్సీరాణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వైస్‌చైర్మన్ శిరసాని రవికిషోర్, డైరెక్టర్లు కొంగర జోగేంద్రప్రసాద్, బుస్సా నాగరాజు, యార్డు ప్రత్యేకశ్రేణి కార్యదర్శి జేవీ సుబ్బారావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బొజ్జ గణపయ్యకు భక్త నీరాజనం


మంగళగిరి: పూలమార్కెట్ సెంటరులో కొలువైన విఘ్నేశ్వరుడు

మంగళగిరి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వేడుకలను మంగళగిరి ప్రజలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. వాడవాడలా విభిన్న రూపాల్లో వున్న గణనాథులను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళగిరిలో కస్తూరి కంగన్‌హాలు వద్ద, పాతమంగళగిరి సీతారామస్వామి కోవెల, జీఆర్ స్కూల్, భార్గవపేట, కుప్పురావు కాలనీ సెంటర్లలో ఏర్పాటుచేసిన గణనాథుని ప్రతిమలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మంగళగిరి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలు, వ్రతకల్పం పుస్తకాలను పంపిణీ చేశారు. స్థానిక మిద్దె సెంటరు, ఎంటీఎంసీ కార్యాలయం, ఎకో హిల్ పార్కు, మిడ్‌వ్యాలీ సిటీ, ఇందిరానగర్, ఆత్మకూరు, ఆటోనగర్ తదితర ప్రాంతాల్లో వీటిని పంపిణీ చేశారు.

ఉండవల్లిలో ఎకో ఫ్రెండ్లీ (మట్టి) గణపతి

తాడేపల్లి(ఉండవల్లి): తాడేపల్లి మండలం ఉండవల్లి సెంటర్ శ్రీ గణేష్ యూత్ ఉత్సవ కమిటి ఆధ్వర్యంలో ఎకో ఫ్రెండ్లీ (మట్టి) గణపతి విగ్రహాన్ని బుధవారం జనసేన అధినేత, డిప్యూటి సీఎం పవన్‌కళ్యాణ్ పిలుపుమేరకు ఏర్పాటుచేసినట్లు నిర్వాహకులు తెలిపారు. 13 అడుగుల ఈ ఎకో ఫ్రెండ్లీ గణపతి వద్ద ప్రతి రోజూ పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2వ తేదీ డిప్యూటి సీఎం పవన్‌కళ్యాణ్ జన్మదినం సందర్భంగా సుమారు 3వేల మందికి అన్నసంతర్పణ, 6న నిమజ్జనం చేస్తామన్నారు.

● దుగ్గిరాల: మండలంలోని పలు గ్రామాల్లో వినాయకచవితి వేడుకలను బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. 18 గ్రామాల్లో 96కిపైగా వినాయక మండపాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చిన వినాయకుని మండపాల వద్ద సందడి నెలకొంది. దుగ్గిరాల రథం సెంటర్లోని శ్రీసిద్ధిబుద్ధి సమేత లక్ష్మీగణపతి ఆలయం వద్ద మూడు దశాబ్దాలుగా నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తుల కోలాహలం నెలకొంది.

● తాడికొండ: తాడికొండతోపాటు అన్ని గ్రామాలల్లో ప్రజలు వినాయక చవితి పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. గ్రామాల్లో గణేష్ మండపాలు ఉత్సవ శోభతో అలరారుతున్నాయి. గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా యువకులు పోటీలుపడి తమ వీధుల్లో, గ్రామాల్లో విగ్రహాలను ఏర్పాటుచేశారు. ప్రత్యేకంగా అలంకరించిన మండపాలతో వినాయకుడి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి.

● తుళ్లూరు: భక్తిశ్రద్ధలతో చవితి వేడుకలు మండలంలో నిర్వహించారు. గ్రామాలలో పలు సెంటర్‌లలో గణేష్ విగ్రహాలు నెలకొల్పి పూజలు నిర్వహించారు. గణనాథుల ఊరేగింపులో అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. అలాగే పలు సాంస్కృతిక కార్యక్రమాలు, గణనాథులకు గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు స్వామివార్లకు హారతులు సమర్పించారు.

● వట్టిచెరుకూరు: మండల గ్రామాల్లో వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆయా మండపాల్లో ప్రతిష్ఠించుకున్న గణనాధుడిని నేత్ర పరంగా పత్రి, పూలమాలలతో శోభాయమానంగా అలంకరించారు. గణనాధునికి ప్రీతి పాత్ర మైన కుడుములు, ఉండ్రాళ్ళు, పానకం, వడపప్పు తదితర పిండి వంటలు సిద్ధం చేసుకొని ప్రత్యేక పూజల్లో కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు. వినాయక చవితి ప్రాముఖ్యతను వివరిస్తూ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక చవితి సందర్భంగా పుల్లడిగుంట గ్రామస్తులకు మట్టి ప్రతిమలను ఎన్‌ఆర్‌ఐ ఉప్పుటూరి రామ్ చౌదరి సహకారంతో ఆయన తండ్రి ఉప్పుటూరి చిన రాములు అందించారు. అలాగే వినాయక చవితిని పురస్కరించుకొని చమళ్ళమూడి గ్రామ ఉప సర్పంచ్ మూల్పూరి రాజేంద్ర ప్రసాదు చమళ్ళమూడి, వింజనంపాడు, కాట్రపాడు, వట్టిచెరుకూరు గ్రామస్తులకు వెయ్యి వరకు మట్టి వినాయకుని ప్రతిమలను అందజేశారు

● కాకుమాను: కాకుమానులో అగస్త్యేశ్వర స్వామి ఆలయం , చెన్నకేశవ స్వామి ఆలయం, రామాలయం, చైతన్య గోదావరి బ్యాంక్, తదితర ప్రదేశాలలో గణనాధుని విగ్రహాలను ఏర్పాటు చేశారు. అలాగే అప్పాపురంలో వేణుగోపాల స్వామి ఆలయం, క్రిష్ణ కాలువ వద్ద, ఎంపీపీ పాఠశాల వద్ద, అలాగే కొండపాటూరు, కొమ్మూరు, చిన్నలింగాయపాలెం , రేటూరు, బోడిపాలెం, తెలగాయపాలెం, గరికపాడు, బీకే పాలెం, గార్లపాడు, కొండబాలవారిపాలెం, కొల్లిమర్ల, పాండ్రపాడు తదితర గ్రామాలలో తెలుగు యువత ఆధ్వర్యంలో భారీ ఏకదంతుడి విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అప్పాపురం వేణుగోపాల స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విఘ్న వినాయకుడు తొలి రోజు పూజల అనంతరం నిమజ్జనానికి తరలించారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

తెనాలి డివిజన్‌లో ఎడతెరిపి లేని వర్షం

దుగ్గిరాలలో 58.6 మి.మీ. నమోదు

తెనాలి అర్బన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): తెనాలి డివిజన్‌లో బుధవారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. ఉదయం 5 గంటలకు మొదలైన వర్షం మధ్యాహ్నం 1గంట వరకు పడుతూనే ఉంది. దుగ్గిరాలలో 58.6 మి.మీ అత్యధిక వర్షం నమోదు కాగా పొన్నూరులో 22.6 మి.మీ అత్యల్ప వర్షం నమోదు అయ్యింది. చేబ్రోలులో 48.4 మి.మీ, తాడేపల్లిలో 45.6 మి.మీ, కొల్లిపరలో 43.2 మి.మీ, మంగళగిరిలో 39.2 మి.మీ, తెనాలిలో 38.8 మి.మీ, కాకుమానులో 39.4 మి.మీ వర్షపాతం నమోదయ్యిందని అధికారులు తెలిపారు.

యూరియా కొరతపై కేంద్రంతో పోరాడాలి: దిలీప్

పొన్నూరుటౌన్, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యూరియా కొరతపై కేంద్ర ప్రభుత్వంతో కూటమి పార్టీల నాయకులు పోరాటం చేయాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అందే దిలీప్ గురువారం కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా యూరియా కొరత తో రైతులు తీవ్ర అందోళన చెందుతున్నారు అన్నారు. రాష్ట్రానికి కావలసిన యూరియా కేటాయించే వరకు కేంద్రంతో రాజీలేని పోరాటం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. యూరియా అక్రమ నిల్వలను నియంత్రించి రైతాంగానికి యూరియా అందేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని దిలీప్ డిమాండ్ చేశారు.

నేత్రదానంపై విద్యార్థులకు అవగాహన

తెనాలి అర్బన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కొతపేటలోని మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం నేత్రదానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సామాజిక సేవ సంస్థ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నేత్ర వైద్యులు పీ భాస్కర్ నేత్రదాన ఆవశ్యకత వివరించారు. హెచ్‌ఎం భారతి, ఉప్పల సాంబశివరావు, నారాయణరావు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను తొలగించాలి: ములకా

కొల్లిపర, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనలో కరెంటు చార్జీలు తగ్గకపోగా మరింత పెరగటం ఆందోళన కలిగిస్తుందని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని దావులూరు, తూములూరు గ్రామాల్లో రైతు సంఘం నాయకులు పర్యటించి పెంచిన విద్యుత్ చార్జీలు, స్మార్ట్ మీటర్లు బిగింపుపై గ్రామస్తులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల బిగింపును తక్షణమే నిలుపుదల చేయాలన్నారు.

సత్యహరిశ్చంద్రుడిలా అంబటి మురళి మాటలు: దర్శి భాస్కరరావు

గుంటూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): అంబటి మురళి సత్య హరిశ్చంద్రుడిలా మాట్లాడుతున్నాడని కాకాని శివాలయం మాజీ చైర్మన్ దర్శి భాస్కరరావు విమర్శించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్‌పై విషప్రచారాలు చేస్తూ కులాలను రెచ్చగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అవినీతి చేసిన ఎంపీపీ తుళ్ళిమిల్లి శ్రీనివాస్ మంచివాడు అని చెప్పేందుకు అంబటి మురళి ప్రయత్నిస్తున్నాడని విమర్శించారు. ఆయన చేసిన అవినీతిపై డ్వామా పీడీ ఫిర్యాదు చేసిన తర్వాత విచారణ చేసి అరెస్ట్ చేశారని, అది రాజకీయ కక్షతో చేసిన అరెస్ట్ కాదన్నారు. తక్కెళ్లపాడులో ఎన్టీఆర్ విగ్రహం విషయంలో వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారం చేసి యాదవులు కొట్టుకునేలా చేశారన్నారు. గొడవలకు తావు లేకుండా కృష్ణుడి రూపంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహాన్ని తీసేసి వేరే విగ్రహం ఏర్పాటు చేశామని తెలిపారు. సమావేశంలో షైలా వెంకటరామ రాజు, తాళ్ళ శ్రీనివాసరావు, డి. భూషిబాబు, డి.వెంకటేశ్వరరావు, ఎం.సుబ్బారావు, కె.మల్లిఖార్జునరావు, పి.నాగసురేష్ పాల్గొన్నారు.

స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డుకు నారాకోడూరు విద్యార్థుల ఎంపిక

పొన్నూరు టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): నారాకోడూరు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.ఏడుకొండలు గురువారం తెలిపారు. నారాకోడూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలలో ప్రదర్శిస్తున్న నైపుణ్యాలకు ఈ అవార్డు లభించినట్లు చెప్పారు. పాఠశాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు బీ వెంకటేశ్వరరావు, ఎస్ ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులు హ్యాండ్‌బాల్ పోటీలకు శిక్షణ పొంది జాతీయస్థాయిలో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్య వహించి ప్రదీప్ కనపరుస్తున్న నేపథ్యంలో ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపికయ్యారు. ఆగస్టు 29వ తేదీ జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి సీవీ రేణుకా నుంచి ఈ అవార్డును పొందుతున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏడుకొండలు తెలియజేశారు.

విద్యార్థుల అభివృద్ధికి వర్సిటీ కృషి: వీసీ గంగాధరరావు

ఏఎన్‌యూ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల అభివృద్ధికి యూనివర్సిటీ కృషి చేస్తుందని వీసీ ఆచార్య గంగాధర రావు అన్నారు. గురువారం యూనివర్సిటీలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ హయ్యర్ ఎడ్యుకేషన్ అమరావతి క్వాంటం వ్యాలీ సంయుక్తంగా నిర్వహించిన హ్యాకథాన్ పోటీలు జరిగాయి. దీనిలో ఎంపికైన విద్యార్థినీ విద్యార్థులను వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కే గంగాధర్, రెక్టార్ ప్రొఫెసర్ రత్నషీలామణి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జీ సింహాచలం, డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ బ్రహ్మాజీరావు వీసీ ఛాంబర్ లో అభినందించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులలో జ్ఞానాన్ని పెంపొందించే విధంగా వర్సిటీ యంత్రాంగం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ లింగరాజు, అసిస్టెంట్ ప్రిన్సిపల్స్ డాక్టర్ ఎం.గోపి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా వినాయక చవితి వేడుకలు


చవితి పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ ఆలపాటి


పొన్నూరు సిద్ధి వినాయక నగర్‌లో గణేష్ మండపంలో పూజలు చేస్తున్న కమిషనర్ రమేష్ బాబు తదితరులు


తెనాలి మెడికల్ షాప్స్ రోడ్డులో కలువ గణనాథుడు

పొన్నూరు టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు, చేబ్రోలు మండలాల్లో బుధవారం వినాయక చవితి వేడుకలు వాడవాడల వైభవంగా జరిగాయి. పొన్నూరు పట్టణంలో నిడుబ్రోలు రైలు పేటలో ఏర్పాటు చేసిన కాలింద మర్దన కృష్ణ కొలువుదీరిన గణనాథుడు పట్టణవాసులను అమితంగా ఆకట్టుకున్నాడు. అలాగే నిడుబ్రోలు వినాయక ఆలయంలో చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. పొన్నూరు పట్టణంలో పలు కూడళ్ళలో ఆకరణీయమైన గణనాధుల మండపాలను నిర్వాహకులు ఏర్పాటుచేసి చవితి వేడుకలను నిర్వహించారు. పొన్నూరు పట్టణ శివారు జీబీసీ రోడ్లో ఉన్న సిద్ధి వినాయక ఆలయంలో చవితి వేడుకలు కోలాహల వాతావరణంలలో జరిగాయి. గణనాథుడికి ఉదయం పంచామృత అభిషేకాలను ఆలయ అర్చకులు మణికంఠ స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. పాత పొన్నూరు, భావనగర్ కాలనీ, తెలగపాలెం, నేతాజీ నగర్, నిడుబ్రోలు, విద్యానగర్, సాంబశివ నగర్, షరాఫ్ బజార్ వంటి పలు కాలనీలో వినాయక విగ్రహాలు, మండపాల అలంకరణ అందరినీ ఆకట్టుకున్నాయి. పట్టణంలోని సిద్ధి వినాయక నగర్‌లో ఏర్పాటు చేసిన ఎస్వీఎన్ యూత్ మండపంలో మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్ బాబు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మండల పరిధిలోని చింతలపూడి, పచ్చలతాడిపర్రు, ములుకుదరు వంటి పలు గ్రామాల్లో గణనాధుల మండపాలులో ప్రత్యేక పూజలు జరిగాయి. మండల పరిధిలోని చింతలపూడి గ్రామంలో కొలువుదీరిన విఘ్నేశ్వర ఆలయంలో చవితి వేడుకలు అంబరాన్ని అంటాయి. చేబ్రోలు మండలంలోని చేబ్రోలు, నారాకోడూరు, సెలపాడు, సుద్ధపల్లి, వడ్లమూడి వంటి గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాధుల విగ్రహాలు ప్రత్యేక పూజలను అందకున్నాయి. పొన్నూరు పట్టణంలోని పత్రి, వినాయక పూజకు వినియోగించే గణనాధుల విక్రయాల స్టాల్స్ నిర్వాహకులు వర్షం కారణంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

● పెదకాకాని: పెద కాకాని శ్రీమల్లేశ్వర స్వామి వారి దేవస్థానములో గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం ఆలయ స్థానాచార్యులు పర్యవేక్షణలో అర్చక స్వాములు, వేద పండితులచే శాస్త్రోక్తంగా ఉత్సవాలు ప్రారంభించినట్లు ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలా కుమార్ తెలిపారు. 5న వినాయక స్వామివారి నిమజ్జనం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగునని ఆలయ ఉప కమిషనర్ తెలిపారు.

● ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన గణేష్ ఉత్సవాలు రెండో రోజు పూజ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ సింహాచలం. గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నాగార్జున విశ్వవిద్యాలయ విద్యార్థులు మట్టి బొమ్మను ఏర్పాటు చేయడం ఆనందదాయకం అని అన్నారు. ఎటువంటి గొడవలు ఇబ్బందులు లేకుండా విశ్వవిద్యాలయంలో జరుపుకోవడం విద్యార్థుల్లో ఉన్నటువంటి ఐక్యతకి నిదర్శనమన్నారు. ప్రత్యేక పూజలు భాగంగా విశ్వవిద్యాలయ ఆర్ట్స్ కామర్స్ అండ్ లా కళాశాల ప్రాచార్యులు ప్రొఫెసర్ ఎం సురేష్ కుమార్ సతీసమేతంగా పాల్గొని ఆ గణనాధునికి పూజలు నిర్వహించారు. ఏఎన్యూ దూర విద్యా కేంద్ర డైరెక్టర్ ప్రొఫెసర్ వీ వెంకటేశ్వర్లు, డిపార్ట్మెంట్ సోషియాలజీ అండ్ సోషల్ వర్క్ హెచ్‌ఓడీ ప్రొఫెసర్ ఎం త్రిమూర్తిరావు, ప్రొఫెసర్ ధనలక్ష్మి, సీఎస్ఆర్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం వెంకటరమణ, టీచింగ్ మరియు నాన్ టీచింగ్ స్టాఫ్, స్కాలర్స్, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.


ఏఎన్‌యూ: పూజల్లో పాల్గొన్న రిజిస్ట్రార్ సింహాచలం, తదితరులు


తెనాలి బాలాజీరావుపేటలో పడవలో విఘ్నేశ్వరుడు


తెనాలి పార్కు రోడ్డులో ఖైరతాబాద్ మోడల్ వినాయకుడు

ఘనంగా గణనాథుని పూజలు... ఊరేగింపులు


అంగలకుదురులో గణపతిని ఊరేగిస్తున్న భక్తులు

తెనాలి అర్బన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వినాయకచవితిని పట్టణ ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని ప్రతీ వీధిలో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసి మండపాన్ని, మార్గాన్ని అలంకరించారు. పండుగ రోజు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పడుతున్న వర్షాన్ని కూడా లెక్క చేయకుండా వినాయకుని పూజించారు. సుల్తానాబాద్‌లో వినాయక విగ్రహానికి జరిపిన పూజల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, టీడీపీ నాయకులు పాలడుగు సుధాకర్, మహ్మద్ ఖుద్దూస్, కోగంటి రోహిత్, రావి చిన్ని, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. రజకపేటలో సాయి రామ్ యూత్ ఏర్పాటు చేసిన ఆంజనేయ స్వామితో కలిసి ఉన్న వినాయక విగ్రహం, రామలింగేశ్వరపేటలో ఎడ్లబండిపై గణనాధుడు, బాలాజీరావుపేటలో దుర్గాపవన్‌సాయి యూత్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉత్సవాలలో పడవలో పార్వతీ పరమేశ్వరులతో వినాయకుడు, మెడికల్ షాప్స్ రోడ్డులో కలువ గణపతి, కవిరాజా పార్కు రోడ్డులో ఖైరతాబాద్ మోడల్ విగ్రహం భక్తులను ఆకట్టుకుంది. విజయవాడ రోడ్డులో ఉన్న భారీ గణపతి విగ్రహానికి పెద్ద సంఖ్యలో భక్తులు పూజలు చేశారు. మహేంద్ర కాలనీలో జరిగిన వినాయక పూజల్లో గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి, సభ్యులు పాల్గొన్నారు. గంగానమ్మపేటలో వినాయకునికి కల్యాణం జరిపించారు. నాజరుపేట పుట్టా రాఘవయ్య రైస్‌మిల్లు రోడ్డులో భక్తులకు మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక రమేష్, కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు అన్నదానం చేశారు. వినాయక మండపాల వద్ద చేసిన అలంకరణలు విద్యుత్ దీప కాంతులు ఎంతగానో ఆకట్టుకున్నాయి. పలు చోట్ల రెండవ రోజే పూజలు చేసిన గణపతిని అలంకరించిన వాహనంపై ఉంచి మేళతాళాలు తీన్‌మార్ డప్పులతో ఊరేగించి నిమజ్జనం చేశారు.


కొల్లిపరలో వినాయక విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

● కొల్లిపర: మండలంలో వినాయకచవితి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రెండురోజులుగా గణనాథుడిని ప్రత్యేకంగా అలంకరించి పండితులు అత్యంత వైభవంగా పూజలు నిర్వహిస్తున్నారు. గురువారం వల్లభాపురం, మున్నంగి, తూములూరు, దావులూరు, చక్రాయపాలెం, అత్తోట, హనుమాన్ పాలెం తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను సుందరంగా తీర్చిదిద్ది ఆహ్లాదకరంగా పూజలు చేశారు. కొల్లిపర శ్రీషిర్డిసాయిబాబా మందిరంలో మహిళలు పూజలు చేసి భజనలు నిర్వహించారు. మండల కేంద్రం కొల్లిపరలో రజకులు ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి, తూములూరు, చక్రాయపాలెం, అత్తోట తదితరు గ్రామాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలకు పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్లపై విగ్రహాలను ఏర్పాటు చేసి గ్రామాల్లో కనక తప్పెట్లు, పలు నృత్యగీతాలు, వాయిద్యాలు, జయజయ ధ్వానాలతో బాణా సంచా కాల్చుతూ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం కృష్ణానదిలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు.

విద్యుత్ సంస్కరణల పేరిట భారం మోపొద్దు

● సీపీఎం కార్యదర్శి బాబుప్రసాద్

తెనాలి అర్బన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్కరణల పేరిట ప్రజలపై భారం మోపొద్దని సీపీఎం కార్యదర్శి కె.బాబుప్రసాద్ కోరారు. పట్టణంలో అన్నాబత్తుని పురవేదిక వద్ద బుధవారం అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. సంస్కరణలకు వ్యతిరేకంగా 2000 ఆగస్టులో జరిగిన కాల్పుల్లో అశువులు బాసిన వారికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బషీర్‌బాగ్‌లో పోలీసులకు, ఉద్యమకారులకు జరిగిన కాల్పుల్లో ముగ్గురు బలయ్యారని చెప్పారు. కార్యక్రమంలో వై అశోక్, నాగరాజు, సుబ్రహ్మణ్యం, ఆదినారాయణ, రాజశేఖర్, వాసు, ప్రకాష్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

● పొన్నూరు టౌన్: విద్యుత్తు చార్జీల భారం తగ్గించి స్మార్ట్ మీటర్లను తక్షణమే ఉపసంహరించుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి నిమ్మకూరు రమేష్ బాబు డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో గురువారం బషీర్ బాగ్ విద్యుత్ పోరాట అమరవీరుల సంస్మరణ కార్యక్రమం జరిగింది. మృతులకు నివాళులు అర్పించారు. అనంతరం రమేష్ బాబు మాట్లాడుతూ విద్యుత్ సంస్కరణ పేరుతో రాష్ట్ర ప్రజానీకంపై మోపుతున్న విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ప్రజలు మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు రామ్ బ్రహ్మాచారి, సెల్వం రాజు, ఆంటోని పాల్గొన్నారు.

● పొన్నూరు టౌన్ (చేబ్రోలు): విద్యుత్ స్మార్ట్ మీటర్ల పై ప్రజా పోరాటం నిర్వహిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి సభ్యుడు దండా లక్ష్మీనారాయణ తెలిపారు. చేబ్రోలు గురువారం విద్యుత్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బషీర్బాగ్ మృతవీరులకు నాయకులు నివాళులర్పించారు కార్యక్రమంలో సీపీఎం నాయకులు హనుమంతరావు, మస్తాన్‌వలి, మహేంద్ర, మస్తాన్ పాల్గొన్నారు.

● పెదకాకాని: హైదరాబాదులోని బషీర్‌బాగ్ మృతులకు గురువారం పెదకాకానిలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి నేతాజీ మాట్లాడుతూ, విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా 2000 సంవత్సరంలో బషీర్‌బాగ్ లె నిరసన చేపట్టిన వారిపై లాఠీచార్జ్ చేసి, గుర్రాలతో తొక్కించి,కాల్పులు జరిపారన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ, బీ బాబురావు, బీ సాంబయ్య, కేరాఘవయ్య, ఏ నాగేశ్వరరావు, ఆర్‌వెంకటరమణ, అప్పారావు, సాంబయ్య, వెంకటేశ్వర్లు, లక్ష్మీకాంతమ్మ, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.


ప్రదర్శనలో పాల్గొన్న సీపీఎం కార్యకర్తలు

క్రమశిక్షణతో విద్య వీవీఐటీయూ నినాదం

యూనివర్సిటీ వైస్ చాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్

పెదకాకాని, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మంచి నడవడికతో ఉంటే విజయం తప్పక వరిస్తుందని వీవీఐటీయూ విశ్వసిస్తుందని యూనివర్శిటీ చాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్ అన్నారు. గురువారం కళాశాలలో నిర్వహించిన 2025-26 విద్యాసంవత్సరం మొదటి ఏడాది విద్యార్థుల తరగతుల ప్రారంభ కార్యక్రమలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈఏపీసెట్ 2025లో టాప్ ర్యాంకర్లుగా నిలిచి, విశ్వవిద్యాలయంలో ప్రవేశం పొందిన విద్యార్థులు జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ వీవీఐటీ విశ్వవిద్యాలయంగా ప్రకటించిన వెంటనే విద్యార్థులు తల్లిదండ్రుల నుంచి అనూహ్య స్పందన లభించిందన్నారు. మేము వీవీఐటీయూ విద్యార్థులం అని గర్వంగా చెప్పుకోగలిగేంతవరకూ విశ్రమించమని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ కొడాలి రాంబాబు మాట్లడుతూ విశ్వవిద్యాలయంలో మౌలిక వసతులు సీమన్స్ ఎక్సెలెన్స్, గూగుల్ కోడ్ ల్యాబ్ పూర్తి స్థాయిలో వినియోగించుకోవటం వలన విద్యార్థులు ఉపాధి కల్పన నైపుణ్యాలను సంపాదించుకోవచ్చని తెలిపారు. వీవీఐటీయూ రిజిస్ట్రార్ వై మల్లికార్జున రెడ్డి , అడ్మిషన్ డైరెక్టర్ ఉదయ్ కుమార్ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, సెక్రటరి సూర్యదేవర బదరీప్రసాద్, అకడమిక్ డీన్ కే గిరిబాబు, విభాగాధిపతులు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


యూనివర్సిటీలో మొదటి సంవత్సరం తరగతుల ప్రారంభోత్సవ పూజలో పాల్గొన్న వర్సిటీ వైస్ చాన్సలర్ విద్యాసాగర్


పల్లె నిద్రలో భాగంగా యువతకు సూచనలు ఇస్తున్న డీఎస్పీ జనార్దనరావు

మత్తు పదార్థాలకు బానిసలు కావద్దు

● డీఎస్పీ జనార్దనరావు

పొన్నూరు టౌన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను కోల్పోవద్దని తెనాలి డీఎస్పీ జనార్ధన్‌రావు సూచించారు. పొన్నూరు పట్టణంలోని ఎరుకలవాడలో బుధవారం రాత్రి డీఎస్పి పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో కలిసి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ప్రధానంగా గంజాయి మాదకద్రవ్యాలకు బానిసలు కావద్దని యువతకు సూచించారు. కాలనీలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ ఎల్ వీరానాయక్, ఎస్ఐ శ్రీహరి పాల్గొన్నారు.

ధూళిపాళ్ళ రవికుమార్‌కు ఘన నివాళి

పొన్నూరు టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ నాయకుడు ధూళిపాళ్ళ రవికుమార్ 24వ వర్ధంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ సోదరుడు, మాజీ మంత్రి ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి, చిన్న కుమారుడు రవి కుమార్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం చర్మకారులకు రవికుమార్ పేరుతో గొడుగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బండ్లమూడి బాబురావు, పట్టణ అధ్యక్షుడు పఠాన్ అహ్మద్ ఖాన్, చిలక రవి, తదితరులు పాల్గొన్నారు.


చర్మకారులకు గొడుగులు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు



సభలో మాట్లాడుతున్న ఆర్‌బీఐ జీఎం మహన, వేదికపై బ్యాంకు చైర్మన్ సత్యనారాయణమూర్తి తదితరులు

బ్యాంకింగ్ సేవలందరికీ చేరేలా ఆర్‌బీఐ కృషి

తెనాలి అర్బన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : బ్యాంకింగ్ సేవలను ప్రజలందరికి చేర్చేందుకు ఆర్‌బీఐ కృషి చేస్తుందని జనరల్ మేనేజర్ ఆర్కే మహన పేర్కొన్నారు. స్థానిక కొత్తపేటలో విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు 57వ శాఖను గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో బ్యాంకు చైర్మన్ జేవీ సత్యనారాయణమూర్తి అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా మాట్లాడుతూ, ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు జనధన్ ఖాతాల ద్వారా గ్రామీణ ప్రజల భాగస్వామ్యం వహించే లక్ష్యంగా సహకార రంగంలో బ్యాంకులు పని చేయాలన్నారు. వీటికి కూడా ఆర్‌బీఐ నిబంధనలు వర్తిస్తాయని, పలు శాఖల ద్వారా అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. బ్యాంకు శాఖలు తగినన్ని ఏటీఎంలు ఏర్పాటు చేసి బ్యాంకు సేవలను మరింత విస్తృతం చేయాలన్నారు. చైర్మన్ మాట్లాడుతూ, సహకార రంగంలో నిబంధనలు త్రికరణ శుద్ధిగా అమలు చేసి సామాన్యుల జీవన ప్రమాణాలు పెంచేందుకు అవసరమైన కృషి చేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే ఆంజనేయులు, వైస్ చైర్మన్ రాఘవేంద్రరావు చలసాని, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ, కుమార్ పంప్స్ ఎండీ కొత్త సుబ్రహ్మణ్యం, కాకతీయ బ్యాంకు చైర్మన్ డీఎల్ కాంతారావు, అర్బన్ బ్యాంకు చైర్మన్ మంగమూరి హరిప్రసాద్, గంగరాజు, యల్లారావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రకృతి సాగు పద్ధతులు అవలంభించాలి

● ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారి భావన

పొన్నూరు టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి సాగు పద్ధతులు అవలంబించటం ద్వారా ఆరోగ్యకరమైన దిగుబడులు పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారి భావన అన్నారు. మండల పరిధిలోని బ్రాహ్మణకోడూరు, వెల్లలూరు గ్రామాల్లో గురువారం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంట పొలాలను పరిశీలించిన సిబ్బంది పంటల సాగుపై రైతులకు సూచనలు చేశారు. అధిక వర్షాల వల్ల పంట దెబ్బ తినకుండా బీజామృతం, వేప మందు కషాయం వాడుకోవడం వల్ల పంట దెబ్బ తినకుండా కాపాడుకోవచ్చని సూచించారు. ఎకరానికి రెండు వందలు మాత్రమే ఖర్చు అవుతుందన్నారు. ఆకు ముడత పురుగు నివారణకు నీమాస్త్రం బాగా పనిచేస్తుందని చెప్పారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంబించడం ద్వారా సాగు ఖర్చులు తగ్గుతాయి అన్నారు. చిరుధాన్యాల సాగును కూడా ప్రకృతి విధానంలో అవలంభించవచ్చన్నారు. రసాయనిక ఎరువులకు బదులు పచ్చిరొట్ట ఎరువులు జీవన ఎరువులు వాడుకొని రైతులు ఖర్చులు తగ్గించుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో బ్రాహ్మణకోడూరు సర్పంచి అశోక్, వ్యవసాయ శాఖ ఎంపీఈవోలు వి.భాను, రేఖ, ఎస్ సురేష్ బాబు పాల్గొన్నారు.